పాదార్చన

ద్వితీయభాగం




జిల్లెళ్ళమూడి అమ్మ శ్రీచరణాలు

బులుసు లక్ష్మీ ప్రసన్న సత్యనారాయణ శాస్త్రి

పాదార్చన

ద్వితీయభాగం



జిల్లెళ్ళమూడి అమ్మ శ్రీచరణాలు

బులుసు లక్ష్మీ ప్రసన్న సత్యనారాయణ శాస్త్రి

సర్వసామ్య సంకలితము
మొదటి ప్రచురణ : ఆగస్టు 2009

ఈ గ్రంథంలోని గేయాలను,
ఎవ్వరైనా, ఎప్పుడైనా హాయిగా పాడుకొని,
తాను ఆనందించి, ఇతరులను ఆనందింపచేయవచ్చు.

కాపీలు : 2000

మూల్యం : రూ.**50**/-

ప్రతులకు :

అమ్మ ప్రచురణలు
ఎఫ్ -4, నాగమల్లితోట,
కాకినాడ - 533 003
Ph : 0884-2387684

ముద్రణ :
పద్మనాభ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
నాగేశ్వరరావు వీధి, రామారావుపేట
కాకినాడ - 533 004
ఫోన్ : 0884 - 6588013

విషయ సూచిక

జిల్లెళ్ళమూడి అమ్మ సంస్తవము

యయా శక్త్యా బ్రహ్మ కమలనయనః ఫాలనయనః
జగత్స్రష్టుం పాతుం ప్రళయముపనేతుం చ కుశలాః।
యయా వ్యాప్తం విశ్వం వసతిఖలు యస్యాం జగదిదమ్
నమామాద్యాం దేవీం ముకుళిత కరస్తా మభయదామ్ ॥

డా॥ పన్నాల రాధాకృష్ణ శర్మ



తెలుగుభాషకు "నేను నేనైన నేను"
అన్న మహావాక్యాన్ని ప్రసాదించిన మహాతల్లి
"జిల్లెళ్ళమూడి అమ్మ" బ్రహ్మాండం అనసూయాదేవి.

"తిండి తినుడను చేతిముద్ర
ఎవరికే ఇంకెవరికే"
18వ గేయఖండిక "అంతా" నుండి ఈ గ్రంథం పుట 24

మనవి

శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారిని "జిల్లెళ్ళమూడి అమ్మ" బిడ్డలమందరమూ ఆప్యాయంగా "రాజుబావ" అని పిలుచుకుంటాం.

అమ్మ పుట్టింటి వారి పేరు మన్నవ వారు. వారు మన్నవ గ్రామస్థులు కూడా. పూర్వకాలంలో మన్నవ ఒక అగ్రహారం. మన్నవ వారి ప్రవర, గోత్రాలు ఆంగీరస, ఆయాస్య గౌతమ త్రయార్షేయ ప్రవరాన్విత గౌతమ సగోత్రీకులు. మా బులుసువారి గోత్ర ప్రవరలు కూడా అవే. మేము జిల్లెళ్ళమూడి అమ్మకు సగోత్రీకులం. అమ్మ మా అందరకూ రాజుబావతో ఇలా చుట్టరికం కలిపింది.

జిల్లెళ్ళమూడి అమ్మ తన అవతార విశేషాన్ని ప్రపంచానికి తెలియ చేయాలని 1954లో భావించుకొన్నప్పుడు, ఆ ప్రథమ సంవత్సరంలోనే అమ్మదగ్గరకు చేరిన కొద్దిమంది అదృష్టవంతులలో మన్నవ బుచ్చిరాజుశర్మ ఒకరు.

అమ్మ సాన్నిధ్యంలో మసలుతూ, రాజుబావ అమ్మ జీవితాన్ని, అమ్మపడ్డ కష్టాలను, ఆ కష్టాలను ఎంత సహనంతో ఓర్చుకున్నది, ఆ కష్టాల కడలినుండి సీతామహాసాధ్విలా, అగ్నిపూతయై నిలబడిన ఘట్టాన్ని దర్శించిన మహానుభావుడు.

కొండముది రామకృష్ణ అన్నయ్య రాజు బావ అమ్మమీద వ్రాసిన పాటల సంకలన గ్రంథం, **"అనుభవసారానికి"** ఉపోద్ఘాతం వ్రాస్తూ, "స్థూలంగా పరిశీలిస్తే అమ్మ జీవితచరిత్రను మూడు భాగాలుగా విభజించవచ్చు" నంటాడు.

మొదటిభాగం అమ్మజననం నుండి వివాహం వరకూ, అంటే 1923 నుండి 1936 వరకూ, రెండవ భాగం 1936 నుండి 1956వరకూ, మరి మూడవభాగం 1956 నుండి 1985లో అమ్మ తన దేహయాత్ర చాలించేటంతటి వరకూ.

1923నుండి 1936 వరకూ అమ్మ సచ్చరిత్ర అంతా అమ్మ బాల్యం నుండి వివాహం వరకు అమ్మ భాస్కరరావు అన్నయ్యకు వివరించి మనకు లభించేలా చేసింది. ఈ విషయం నిస్సందేహంగా **"అమ్మ జీవిత మహోదధి"** గ్రంథంలో భాస్కరరావు అన్నయ్య చెప్పాడు.

కాని 1936 నుండి 1956 సంవత్సరాల మధ్యకాలంలోని తన చరిత్రను కూడా అమ్మ భాస్కరరావు అన్నయ్యకు వివరించినా, ఆ భాగం నిగూఢంగా ఉండిపోయింది.

ఈ చరిత్ర బయటకు రావడానికి అమ్మ ఎప్పటికి అనుమతినిస్తుందో!

కొండముది రామకృష్ణ అన్నయ్య ది5.5.1985న తన **"ఆలాపన"** ఉపోద్ఘాతాన్ని గ్రథితం చేశాడు. తరువాత కొద్ది కాలానికే అమ్మ నిర్యాణం 12.6.1985న జరిగింది. అంటే ఈ గ్రంథం అమ్మ ఉండగానే వెలువడింది.

1936 నుండి 1956 వరకూ అతినిగూఢంగా ఉండిపోయిన అమ్మ జీవితంలోని చివరి రెండు సంవత్సరాలు, అంటే 1954-1956 వరకూ అమ్మతో అనుబంధం కలిగి, మన మధ్య ఇంకా ఉన్న మహాపురుషుడు రాజు బావ. అమ్మ యొక్క ఆ జీవిత చరిత్రను కొంత కాకపోతే కొంతైనా చెప్పగల వ్యక్తి అతనొక్కడే. అమ్మ జీవితంలోని 1936 నుండి 1956 వరకూ నిగూఢంగా ఉండిపోయిన చరిత్ర బయటకు రావాలి. వస్తుంది. అమ్మ దివ్య అవతార వైభవం అప్పుడు అందరకూ విదితమై, విశదమవుతుంది.

అది బయటకువచ్చే సమయం కోసం వేచి చూడడమే మనం ప్రస్తుతం చెయ్యగలిగిన పని.

ఆ రోజుల నుండి అమ్మతో అనుబంధాన్ని, అనుభవాలను, సహజభావుకుడైన రాజుబావ గొంతెత్తిపాడుకుని, మనకు వినిపించాడు కూడా!

400 డిగ్రీల సెంటి గ్రేడుల ఉష్ణం ఉండే పొగాకు బేరన్‌లో అమ్మను పడవేస్తే, ఆ బేరన్‌లో 24గంటల ఉండి, నల్లగా దుంపలా కమిలిపోయి, చీరైనా కాలకుండా, బయటకువచ్చిన ఆతల్లిని చూసిన రాజు బావ మనస్సు గిలగిలలాడి, బావురుమని ఆక్రోశించి - **"వెలలేని నీ గాథ వినిపించెద,**

లోకాన నీ జ్యోతి వెలిగించెద,

నీగాథ హృదయాల రగిలేనులే,

రగిలేటి హృదయాలు పగిలేనులే,

తలపోసి, తలపోసి కుమిలేరులే - వగచేరులే,

తలరాత యెటులైన నటులౌనులే,

కలకాలమీగాథ మిగిలేనులే,

అని ఏడుపు దిగమింగుకుని పాడుకున్న పలుకులివి.

అమ్మ పొగాకు బేరన్‌లో కుంపటిలో దుంపలా కమిలిపోయిన ఘట్టాన్ని, దృశ్యాన్ని మనకు తలపుకు తెస్తుంది.

"**అనుభవసారం**" రాజు బావ పాటల సంకలన గ్రంథంలో 69 గేయాలు, పాటలు ఉన్నాయి.

వాటిలో నేను ఐదు పాటలను "పంచరత్నాలు" అని ఎంచుకున్నాను. అవి

(1) ఎంతమంచిదానవోయమ్మ (1)

(2) అమ్మా! స్థిరోభవ - వరదోభవ (67)

(3) అక్షరమునకు ఆది అమ్మ (58)

(4) నీ నామమే పావనం (45)

(5) దిగివచ్చినారు (46)

ఈ పంచరత్నాల సాహిత్యాన్ని గ్రంథం చివర అనుబంధంగా వెలువరిస్తున్నాను.

ఈ "పంచరత్నాలకు' ముక్తాయింపుగా నీరాజనం ఇచ్చే గేయం:-

పరమాత్మవైన నా అమ్మా!
నీరాజనమ్ము గైకొమ్మా; ॥పరమాత్మ॥
సుడిగాలిలో సొక్కిసోలి,
సడిలేని నీ ఒడిలో వ్రాలి
జడప్రాయమైన జీవాళి,
దరిచేర్చు తల్లీ నివాళి! ॥పరమాత్మ॥
భేదమెరుగని నీ విధానాలు,
బోధించుమాకు వేదాలు,
వేదాలు తెలుపు సారాలూ
మా నుదుట నీ చేతివ్రాలు: ॥పరమాత్మ॥

"**అనుభవసారం**"లో రాజు బావ పాడుకున్న అన్ని గేయాలు, పాటలూ అనుభవాల సారమే!

ఆతల్లి, రాజుబావ హృదయ తంత్రులను మీటి, పలికించిన ఈ గేయాలు భావి కాలంలో ఎప్పుడో అన్నమాచార్యుల వారు వ్రాసిన పదాలను ప్రస్తుతం మనం పాడుకొంటున్నట్లుగా ప్రజలు గొంతెత్తి పాడుకొంటారు కూడా.

త్యాగయ్యగారి కీర్తనలను వారి సమకాలంలో, వారి శిష్యులు, ఇతరులూ పాడుకొన్నట్లుగా అమ్మ సమకాలంలో అమ్మ శిశువులందరూ రాజు బావ కొన్ని పాటలను, గేయాలను, పాడుకొంటున్నారు. అమ్మపూజ చేసుకుని, నీరాజన మంత్ర పుష్పాలు ఇచ్చే సందర్భంలో తప్పని సరిగా -

"పరమాత్మవైన నా అమ్మా",

నీరాజనంబు గైకొమ్మా," అన్న గేయంతో అమ్మ వుండగానే నీరాజనం ఇచ్చుకొనేవాళ్లం. సర్వమైన ఆ సర్వాంతర్యామి తత్త్వానికి ఇప్పుడు, భావికాలంలో కూడా సర్వులూ ఇలాగే నీరాజనం పట్టగలరు.

నేను అమ్మచేతిముద్దనే తిన్నాను. కాని అమ్మచేతి వంటరుచి చూడలేదు. అమ్మచేతి వంట రుచి కూడా చూసిన అదృష్ట శాలి రాజు బావ. అమ్మ తనకు కలుగజేసిన అనుభవాల గురించి రాజుబావ వివరిస్తోంటే, నాకు ఎంతో ఈర్ష్య కలిగేది - ఈ అదృష్టవంతుడు ఎంత ఛాన్స్ కొట్టేశాడోనని!

రాజుబావ అమ్మదగ్గరకు 1954లో చేరుకొంటే, నేను స్వర్ణోత్సవాల సందర్భంలో (1973) అమ్మను నా చర్మ చక్షువులతో తొలిసారిగా దర్శించుకొన్నాను.

నేననుకుంటోంటాను, అమ్మ కడుపున పుట్టిన పిల్లల కన్నా, అమ్మ పెంపుడు కొడుకు రాజు బావ నిజంగా చాలా అదృష్టవంతుడని.

2003వ సంవత్సరం జనవరి నెలలో, సంక్రాంతి ఉత్సవాలలో పాల్గొనడానికి జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు, ది 10.1.2003 తేదీ తెల్లవారగట్ల 1.43 గంటలకు "ఇది ఏమి అవతరణమమ్మా, నీది, విధినిమించిన తత్త్వమమ్మానీది," అనే పల్లవి, "ఆనాటికుర్రని పోలు సహనము నీది, ఏ నాటికైనా నిజము తెలియకపోదు" అనే అను పల్లవి వెలువడ్డాయి.

ఈ పల్లవి, అనుపల్లవి స్ఫురించడంతోనే, వీటిని మకుటంగా గ్రహించి, అమ్మ సచ్చరిత్ర గేయ రూపంలో వెలువరించాలనే భావన జనించింది. తరువాత ఏవో పంక్తులు

చరణాల క్రింద వెలువడ్డాయి. ఆ మకుటం, ఈ చరణాలు కలిపి ఒక గేయ కావ్యంగా రూపొందించాలనే ఆకాంక్ష. ఆ భావన కలుగడంతోనే, ఆగ్రంథారంభం కూడా స్ఫురించింది. వాటిని నా "పదార్చన" ద్వితీయభాగంలో ఇరువది మూడవ, ఇరువది నాలుగవ ఖండికలుగా సమర్పిస్తున్నాను. అమ్మ అనుగ్రహం ఉంటే, అమ్మ సచ్చరిత్రను గేయ రూపంలో వెలువరించగలిగే యోగ్యత నాకుంటే, అది జరుగవచ్చు. అది అంతా అమ్మ దయమీద ఆధారపడింది. ఈ కార్యం 1936 నుండి 1956 సంవత్సరాల మధ్య అమ్మ చరిత్ర బయటకు రావడం మీద ఆధారపడి ఉంది కూడా! అంతకన్నా ప్రస్తుతానికి నేను ఏమీ చెప్పలేను.

1923నుండి 1936వరకూ అమ్మ తన ఆత్మకథను భాస్కరరావు అన్నయ్యకు వివరించినది, "అమ్మ జీవిత మహోదధిగా" మొదటి భాగం వెలువడింది. దాని ఆధారంగా ఆ చరిత్రనే మొదటి భాగంగా కీర్తించుకొంటాను కాలాంతరంలో.

ప్రస్తుతానికి "ఈ పదార్చన" ద్వితీయ భాగాన్ని మాత్రమే వెలువరించుకో గలుగుతున్నాను.

2002 సంవత్సరంలో వెలువడిన పదార్చన మొదటి భాగం అమ్మ సంస్థానంలో సంగీత విద్వాంసుడై, తరించిన కాసు రాధాకృష్ణరెడ్డి అన్నయ్యకు అంకితమిచ్చుకొన్నాను. ఆ గ్రంథంలో నాకూ, రాధాకృష్ణరెడ్డి అన్నయ్యకు ఉన్న అనుబంధాన్ని కొద్దిగా వివరించుకొన్నాను.

రాజు బావకు ఎప్పుడో చెప్పాను "అన్నయ్యా! నా ద్వితీయ "పదార్చన పాటల సంకలనాన్ని" నీకు అంకితమిచ్చుకొని ధన్యుణ్ణవుతానని".

రాజు బావా చాలా వినయంగా "నాకెందుకు, ఎవరికైనా పెద్దవారికి ఇయ్యి" అని సలహాఇచ్చాడు.

నాకు రాజు బావే చాలా పెద్దవాడు. అందుచేత రెండో తలంపు లేకుండా "నా పదార్చన ద్వితీయ భాగం" పాటలు, గేయాలు, కీర్తనలు, తత్త్వాల గ్రంథాన్ని శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారికే హృదయ పూర్వకంగా అంకితమిచ్చుకొంటున్నాను.

"పదార్చన ద్వితీయ భాగానికి" నాలుగు పరిచయ వాక్యాలను ప్రసాదించవలసినదిగా ఐదుగురు నా సహోదరులను ప్రార్థించాను. ఈ ఐదుగురూ జిల్లెళ్ళమూడి అమ్మను అర్చించుకొన్నవారు, రాజుబావను బాగా ఎరిగిన వారూ కూడా.

వారు వరుసగా -

(1) శ్రీ బ్రహ్మాండం రవీంద్రరావు

(2) శ్రీ బొప్పూడి రామబ్రహ్మం

(3) శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

(4) శ్రీ తంగిరాల కేశవ శర్మ

(5) శ్రీ రాచర్ల లక్ష్మీనారాయణ

చిరంజీవి రవి (శ్రీబ్రహ్మాండం రవీంద్రరావు) అందించిన మొదటి మాటలో సాంతం నాగురించి, రాజుబావ గురించే చెప్పాడు. నాగేయాల, రచనల గురించి ఏ ఊసూ ఎత్తుకోలేదు. పైగా నేనేదో ఉపనిషత్తుల సారం చెప్పానని, అందుచేత వాటి జోలికి వెళ్ళే సాహసం కూడా చేయలేదన్నాడు. ఎంత నమ్రత. రవిలో ఈనమ్రతా భావమే, అతణ్ణి మా అందరకూ ఆత్మీయుణ్ణి చేసింది.

తనముందు మాటలో మా అందరికీ తెలియని ఒక కొత్త విషయాన్ని, తన చిన్ననాటి విషయాన్ని, ఎంతో సుందరంగా చెప్పాడు రవి. రాజుబావ పెళ్ళిలో రాజుబావ, ప్రభావతి అక్కయ్యల పల్లకీ ఊరేగింపులో ఆ పల్లకీతో కూడా అమ్మ నడచి వెళ్ళిన పరమ సుందరమైన ముచ్చటను మన కళ్ళకు కట్టినట్టు చెప్పడమే కాకుండా, అన్నమయ్య పదసాహిత్యానికి శ్రీ వేంకటేశ్వర స్వామివారు మురిసిపోయి అన్నమ్మయ్యను పల్లకీలో ఊరేగించిన సంఘటనతో పోలుస్తూ, రాజు బావ సాహిత్యానికి అమ్మ నీరాజనం పట్టినట్లు పోల్చాడు. ఇది ఎంతటి గొప్ప విషయం. నా "పదార్చన" ద్వితీయ భాగంలో ప్రపంచానికి వెల్లడైన గొప్ప విషయం.

ఇప్పుడు నేను ఈ గ్రంథాన్ని రాజుబావకు అంకితం ఇవ్వడంలోని ఔచిత్యాన్ని సర్వులూ సమాదరిస్తారనుకొంటాను.

---

* ప్రహ్లాదుడు

ఇంక మా పెద్దన్నయ్యగారు బొప్పూడి రామబ్రహ్మంగారు నిండుకుండ. తనకు సాహిత్యంలో అంతంత మాత్రమే ప్రవేశం అని చెప్పారు. నిజమనుకొనేరు! పెద్దముత్తీవి గ్రామంలోని ముముక్షుజన మహాపీఠం నుండి పోతనగారి ఆంధ్ర మహాభాగవత పురాణ ముద్రణకు అహరహం శ్రమిస్తోన్న వ్యక్తి. అమ్మమీద "పంచదశి"ని పలవరించిన మహాభావుకుడు మా ప్రెసిడెంట్ అన్నయ్యగారు. తక్కువ వాడు కాదు. లెక్కల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, ఇంకో అరడజను విశేష విద్యార్హతలు, ఉన్నాయి. ఆంధ్రా బ్యాంకు జనరల్ మేనేజరుగా పనిచేసి రిటైర్ అయ్యారు. అమ్మపెట్టిన సంస్థ "శ్రీవిశ్వజనని పరిషత్‌కు" 2000 సంవత్సరంలో అమ్మ ఆయన్నే ప్రెసిడెంట్‌గా ఎంచుకుంది. ఇంకో చిత్రం, ఆయన రిటైర్ అయ్యేవరకూ జిల్లెళ్ళమూడిలో ముజ్జిడ్డు తెమలనివ్వలేదు అమ్మ. ఆయన సిద్ధమయ్యేవరకు ఆముజ్జిడ్డు మజ్జిడ్డుగానే కొనసాగించింది. అమ్మ ఓ కరణం గారి కూతురు, ఇంకో కరణంగారి ఇల్లాలు, తనే ఓ పెద్ద కరణం - కరణమే కాదు, కర్త, కార్యం కూడా.

'విశ్వభ్రమణ కారిణి'. కదా!

నాగేయాలు, పాటలు, కీర్తనలు, తత్త్వాలు అన్నీ తెలుగు గేయసాహిత్యంలో నక్షత్రాలవలె ప్రకాశిస్తాయని ఆశీస్సులనిచ్చారు. ఎంత పెద్దమాట ఇది! శ్రీరామబ్రహ్మం అన్నయ్యగారికి కృతజ్ఞుణ్ణి.

ఇంక పి.యస్.ఆర్. అని ఆత్మీయంగా పిలుచుకునే శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ నా గేయాలన్నింటిని స్పృశించి మరీ వాకబు చేశాడు. పార్వతీదేవిని వివాహం చేసుకోవడానికి పర్వతరాజు గృహానికి వస్తూ, (బారాత్) ఆ వివాహ ఊరేగింపులో చేరిన దేవతలను మహాదేవుడు ఎలాపలకరించారని కాళిదాస మహాకవి తన కుమార సంభవ మహాకావ్యంలో వర్ణించారో :

"కంపేన మూర్ధ్నః శతపత్రయోనిమ్
వాచా హరిం వృత్రహణం స్మితేన।
ఆలోక్య మాత్రేణ సురాన్న శేషా
న్సంభావయా మాస యథాప్రధానమ్॥"

(కుమార సంభవమ్ 7-146)

"తలఊపి బ్రహ్మగారిని, రెండు మాటలాడి విష్ణు భగవానుని, ఒక చిరునవ్వు విసిరి ఇంద్రుణ్ణి, ఇంక మిగిలిన దేవతాగణాలనందరిని తన ప్రసన్న దృక్కులతోనే ఎవరి

ఎవరి ప్రాధాన్యతను బట్టి వారిని మహాదేవుడు పలకరించారని కాళిదాస మహాకవి పై శ్లోకంలో వర్ణించినట్లుగా మా పి.యస్.ఆర్ నా గేయాలను వాకబు చేసారు. చాలా చక్కగా విశ్లేషించారు. అభినందన చందనం అంతటా పూశారు. ఎంత సువాసనలీనుతోందో! వారికి నా హృదయపూర్వక అభివందనములు.

ఇంక శ్రీ తంగిరాల కేశవ శర్మ అన్నయ్య వ్యక్తం చేసిన "శుభకామన" గురించి; శ్రీ కేశవ అన్నయ్య నా పదార్చన ద్వితీయ భాగాన్ని "మూడవభాగంగా అనిన ఆశ్చర్యమా" అని ప్రశ్న చేశారు. నాకు తెలియదు "పదార్చన" మొదటి భాగం హైమవతీ దేవి ఆలయ ప్రవేశ చారిత్రాత్మక ఘట్టంలో వెలువడిందని. ఆ గ్రంథాన్ని చూడనైనా చూడలేదు. ఇప్పుడు చూస్తాను. "నా పదార్చన" మొదటిభాగం కూడా హైమక్క పాలరాతివిగ్రహ ప్రతిష్ఠ సందర్భంలో రూపుదిద్దుకొన్నదే!

కేశవ అన్నయ్య అన్నట్లు రాజుబావ ఋషితుల్యుడే. అతనికి నా "పదార్చన ద్వితీయ భాగాన్ని" అంకితమివ్వటం నా అదృష్టం.

కేశవ అన్నయ్య నా "పదార్చన ద్వితీయ భాగం" రాగతాళలయాన్వితమని కితాబు ఇచ్చాడు.

అతనికన్నా నేను సంగీతానభిజ్ఞుడను. ఈ జన్మలో నాకు సంస్కృత భాష, సంగీతం అబ్బలేదు. సంస్కృత భాష రాలేదే అనే బెంగలేదు. ఎందుచేతననగా తెలుగు, ఇంగ్లీషు అనువాదాలతో సంస్కృత భాషలోని భావ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. కాని సంగీతం రాకపోవడం నా జీవితంలో పెద్ద వెలితిగానే ఉంది. ఇప్పుడు ఇంకరాదు. "పోనీలే" అని సరిపెట్టుకుని ఏదో గునగున లాడుకుంటూ గడుపుతున్నాను.

"గేయ రూపంలో అమ్మ సచ్చరిత్ర" నానుండి రావాలని కేశవన్నయ్య ఆకాంక్ష, అమ్మ ఆశీస్సులతో నెరవేరితే "పామరుడైన పండితుడు" అని అమ్మ కితాబు ఇచ్చిన యార్లగడ్డ భాస్కరరావు అన్నయ్యకు అంకితమిచ్చుకుంటాను. భాస్కరరావు అన్నయ్య జిల్లెళ్ళమూడిలో ఇంకో ఋషితుల్యుడు. అతన్ని అర్చించుకునే భాగ్యాన్ని నాకు కలుగజేయమని అమ్మను ప్రార్థించుకొంటున్నాను. ఉన్న శరీరాల దృష్ట్యా, మా ఇద్దరిదీ పెద్ద వయస్సు. శరీరాలు క్షణభంగురాలు కదా! అమ్మ తలచుకొంటే క్షణాలలో గేయరూపంలో అమ్మ సచ్చరిత్ర వెలువడవచ్చు. శ్రీరమణ మహర్షుల వారి ఆశీస్సులతో

"ఉమా సహస్రం" కావ్యకంఠ వాశిష్ఠ గణపతి మునుల నుండి అనుకున్న వ్యవధిలో వెలువడింది.

శ్రీ రమణ మహర్షుల అనుమతితో ఉమా సహస్ర రచనకు ది. 26. 11. 1907 తేదీన కావ్యకంఠ గణపతిమునులు శ్రీకారం చుట్టారు. నెల్లాళ్ళలో ఆగ్రంథ రచన పూర్తి అవ్వాలని నియమం. పూర్తికాకపోతే వ్రాసిన శ్లోకాలు గల కాగితాలను చింపెయ్యాలని నిర్ణయించుకొన్నారు కావ్యకంఠులు. ఇంతలో చూపుడు వేలు మీద గోరుచుట్టు మొలిచింది. వ్రాయడం మందగించింది. గణపతిమునులు వ్రాస్తోన్న గ్రంథాన్ని ఏ రోజుకారోజు చదివించుకుని, విని తృప్తి పడుతూండేవారు మహర్షి. నిర్ణీత సమయం ఒక్కరోజు ఉందనగా 250శ్లోకాల రచన ఆగిపోయింది. గణపతి మునులు చెయ్యి సహకరించడం మానేసింది. ఆరోజున ఐదుగురు వ్రాయసగాళ్ళను కుదుర్చుకొన్నారు. శ్రీరమణమహార్షులు స్వయంగా వచ్చి గణపతిమునుల చెంతకూర్చున్నారు. అంతే, ఆ రోజు ఇరువది నాలుగు గంటల వ్యవధిలో మిగిలిన 250శ్లోకాలు గణపతిమునుల ముఖతా వెలువడ్డాయి. చివరిరోజు తెల్లవారే సరికి గ్రంథ రచన అంతా పూర్తి అయింది. అయ్యాక, శ్రీరమణులు "నేను చెప్పినదంతా జాగ్రత్తగా గ్రహించావు కదా" అని గణపతిమునులను అడిగారు. "అలాగే చేశాను స్వామీ" అన్నారు కావ్యకంఠులు. మహర్షి అందిస్తోంటే గణపతిమునుల నోట్లో నుండి ఆ 250శ్లోకాలు ఒక్క ఇరువది నాలుగు గంటల కాలంలో వెలువడ్డాయి. ఈ ఘటనను పురస్కరించుకుని కావ్యకంఠ వాశిష్ఠ గణపతి మునులు ఆ గ్రంథం చివర ఇలా వ్రాసుకున్నారు.

"యదస్య మహతః కాలే
పారం యాతో ఽస్మికర్మణః।
అనుగ్రహో ఽయ మాచార్య
రమణస్య మహాత్మ నః॥"

అర్థము :- గొప్పదైన నాయీకర్మ నియమిత కాలంలో ముగింపు బొందుటకు మహాత్ముడైన శ్రీరమణగురుని యనుగ్రహ విశేషమే కారణము!

అలా చెయ్యమని, నా ఆకాంక్ష త్వరలో నెరవేరేలా చూడమని అమ్మను వేడుకొంటున్నాను.

శ్రీరాచర్ల లక్ష్మీనారాయణగారు 1975లో జిల్లెళ్ళమూడి అమ్మ తిరువణ్ణామలై,

కలువాయి యాత్రలలో జరిగిన విశేషాల గురించి, కలువాయిలో కంచిమఠం పెద్దస్వామివారు (శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు) ఒకరాత్రి దండ సహితులై ప్రణమిల్లిన సంఘటన గురించి విపులంగా తెలియజేశారు.

నేను గేయ రూపంలో వెలువరించబోయే "జిల్లెళ్ళమూడి అమ్మ సచ్చరిత్ర" మొదట్లోనే

"నాదు గురువులు, జగద్గురువులు
జగద్వంద్యులు, చంద్రశేఖర
సంయమీంద్రులు అందముగ
ఒకనాటి రేయి..,
దండసహితులై దండమిడిన
దండిదృశ్యము డెందమున
నిండగా, మెండుగా పండగా,"

అని చెప్పుకొన్న మాటకు శ్రీరాచర్లవారి వివరణ సత్యత్వాన్ని ప్రతిష్ఠించి పెట్టింది.

శ్రీరాచర్ల లక్ష్మీనారాయణ అన్నయ్య ఈ కథనం, అమ్మ కవిత్వానికి ఇచ్చిన నిర్వచనానికి - చూచినవాడు, చూడనివానికి చూచినట్లు చెప్పగలగడమే కవిత్వం అనుకుంటాను - అనుగుణంగా ఉంది. అట్టి శబ్ద చిత్రణ వెలువరించిన శ్రీరాచర్ల లక్ష్మీనారాయణ అన్నయ్యకు కృతజ్ఞతలు.

ఇంక మా అన్నయ్య గారైన శ్రీబులుసు శ్రీరామ వేంకట సత్యనారాయణ శర్మగారు "పదార్చన ద్వితీయ భాగాన్ని" చదివి "పదార్చన" అన్న ఆశీస్సులను ప్రసాదించారు. అమ్మ "విశ్వమాత", "విష్ణురూపిణి" "విశ్వభ్రమణకారిణి", విష్ణుమాయా విలాసిని" అని చెప్పి, "అమ్మలేని సృష్టే లేదు, విశ్వమూ లేదని ఎంతో" విశాల భావన వ్యక్తం చేశారు. నా "పదార్చన" "విష్ణుపదార్చన" "విశ్వమాత పదార్చన" అని నుడివి ఆశీర్వదించారు, వారికి నా కృతజ్ఞతాంజలులు.

శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారు సంగీత విదుషీమణి. నాకు సంగీతం రాదాయె. కాని గీతరచన సాగింది. అమ్మా! పదార్చన ద్వితీయభాగం కీర్తనల, గేయాల, తత్త్వాల సంగీత విలువలపై తమ అభిప్రాయం తెలియజేయని కోరిన వెంటనే రెండు

మంచిమాటలు వ్రాసి ఇచ్చారు. "శాస్త్రిగారికి ఆశువుగా వచ్చిన కృతి ఇది. భగవంతుని ధ్యాసలో ఉండేవారికి చక్కని పదములు తమకు కూడా తెలియకుండా వస్తాయి. త్యాగరాజస్వామి ఆశువుగా కొన్నివేల కృతులు రామ ధ్యానములోనే ఉండి పాడినారు...........నేను జిల్లెళ్ళమూడి అమ్మను చూడలేదు. కాని శాస్త్రిగారి రచనలు చదివి అమ్మను ఊహించుకుని నమస్కారము చేశాను." ఇవి చాలా పెద్ద మాటలు. శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారికి నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

"పదార్చన ద్వితీయ భాగం" సర్వజిత్‌నామ సంవత్సర ఆషాడ పూర్ణిమకు పూర్తిఅయి, డి.టి.పి కూడా అయింది. అచ్చు అవడం ఆగింది. ఇప్పుడు విరోధినామ సంవత్సర శ్రావణమాసం జరుగుతోంది (జూలై నెల 2009) కారణం ఈ మధ్యకాలంలో నా నుండి రెండు నవలలు వెలువడ్డాయి. ఇంకో రెండు నవలలు అసంపూర్ణంగా ఉన్నాయి. వాటికి విషయ సేకరణ జరుగుతోంది. వాటి భావన, రచనలతో సమయం పరుగులు తీసింది. ఇట్టే రెండు సంవత్సరాలు గడచిపోయాయి. ఇంత విలంబం తరువాత ఇప్పుడు ఇది శంఖంలో పోసిన తీర్థమయింది.

ఎందుకో చెబుతాను. మా కాకినాడలో 'సాహిత్యకళానిధి' విశ్వనాథం సత్యనారాయణ మూర్తిగారనే కవితల్లజులు ఉన్నారు. వారు బి.ఎ., యం.ఎ., పిహెచ్.డి., వంటి ఆధునిక చదువులలోని పెద్ద ఉపాధులు పొందలేకపోయినా, సంస్కృతాంధ్ర భాషలలోని సాహిత్యాన్ని అపోసన పట్టారు ప్రస్తుతం హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ పిహెచ్.డి ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తున్నారు. చిక్కనైన పదబంధాలతో తెలుగు పద్యాన్ని సుందరంగా వెలువరించగల సమర్థులు. పైకిమాత్రం నివురు కప్పిన నిప్పు.

ఎప్పుడో జూలై 2007 చివరలోనే డి.టి.పి అయిన పదార్చన ద్వితీయ భాగం ప్రతిని వారికి ఇచ్చి, తప్పులుంటే దిద్దిపెట్టి, పీఠికగా – నచ్చితే నచ్చిందని వ్రాయండి, నచ్చకపోతే ఇంతకంటె చెత్తపుస్తకం మరొకటి లేదని వ్రాయండి, మీరేమి వ్రాసినా అక్షరం తీసెయ్యకుండా నేను అచ్చువేసుకుంటాను – అనిచెప్పాను.

కవిగారు చాలా శ్రమపడి నాగేయాలలోని తప్పులు సవరించి, "శాస్త్రిగారూ! మీరు వ్రాసిన గేయాలకు పి.యన్.ఆర్ ఆంజనేయ ప్రసాద్ గారు "అభినందన చందనం" పూసారు. నేను వాటిగురించి ఎక్కువ మాట్లాడవలసిన అవసరం లేదు. నాకు తోచిన ఇతర విషయాలు స్పృశిస్తాను. అనిచెప్పి, "అమ్మ ఆప్యాయతలో అమృతాన్ని ఆస్వాదించి,

బ్రతుకును పండించుకొన్న ధన్యజీవి.... శ్రీబులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి" అని ప్రారంభించి చాలా పెద్ద పీఠిక ఇచ్చారు. ఏమిటో చాలా పాత కథలు చెప్పారు. డొక్కా సీతమ్మగారిని స్మరించారు. డొక్కా సీతమ్మగారితోనే ఆవిడ నిరతాన్నదాన వ్రతం అన్నపూర్ణ లోకానికి చేరుకుందిగాని, అమ్మ దైహికంగా కనుమరుగైనా. "అక్కడ (జిల్లెళ్ళమూడిలో) ఇప్పటికీ నిరంతరం అన్నదాన వ్రతం నడుస్తోంది" అని చమత్కరించారు. "ఎఱ్ఱాప్రగడ శంభుదాసుడు - శాస్త్రిగారు అమ్మదాసుడు!! నేను కూడా అమ్మను దర్శించాను. కాని శాస్త్రి గారిలా కాలేకపోయాను" అని నుడివారు. ఇది చాలా పెద్దమాట. మా కవిగారికి నమోవాకములు.

ఇంతమంది పెద్దలు ఆశీస్సులతో వెలువడే ఈ గేయ, కీర్తన, తత్త్వాలు గల "పదార్చన ద్వితీయ భాగాన్ని" శ్రీమన్నవ బుచ్చిరాజు శర్మ గారికి అంకిత మిచ్చుకొని కృతకృత్యుణ్ణవుతున్నాను.

జయహో మాత!

బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణశాస్త్రి

కాకినాడ
9-08-2009
విరోధినామ సంవత్సర
శ్రావణ పూర్ణిమ,
రాఖీ పూర్ణిమ పర్వదినం



"రాజుబావ" అని ప్రఖ్యాతులైన శ్రీ మన్నవ బుచ్చిరాజుశర్మ గారికి
"పదార్చన ద్వితీయభాగాన్ని" అంకితమిచ్చుకుని కృతకృత్యుణ్ణవుతున్నాను

-బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి

బ్రహ్మాండం రవీంద్రరావు
పేట్రన్, శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి

జిల్లెళ్ళమూడి
5-5-2007
అమ్మకళ్యాణదినం

ముందుమాట

కాకినాడ సోదరులు శ్రీ బి.యల్.యస్.శాస్త్రిగారు వ్రాసిన పదార్చన రెండవ భాగం 'ముందుమాట' గా నా మాట కూడా అందించమని కోరారు. అది నా పాండిత్య ప్రకర్ష చూసికాదు. వారికి నాపట్ల ఉన్న ఆత్మీయతకు నిదర్శనంగా, అమ్మతో ఉన్న అనుబంధానికి చిహ్నంగా మాత్రమే. శాస్త్రిగారు రచించిన ఉపనిషత్తులసారం అయిన గేయాల జోలికి వెళ్ళే సాహసం నేను చేయలేదు. అయితే వారితో ఉన్న వ్యక్తిగత అనుబంధం దృష్ట్యా వారు ఏదిచూసినా, విన్నా అందులో అమ్మను, అమ్మ మాటలను అన్వయించుకొంటూ తన్మయులు కావటం గమనించాను. ఆ తన్మయత్వంలో వారందించిన అద్భుత భావాలు ఇందులో గేయాలుగా, పాటలుగా చోటు చేసుకొన్నాయి.

వారు తమకు అమ్మపట్ల భక్తేకాక, అమ్మకు అపురూపమైన, నిస్వార్థమైన, నిష్కళంకమైన అనేక రూపాలుగా సేవ లందించిన సోదరులపట్ల బాధ్యత ఉన్నట్లు -చాలా వినమ్రులుగా భావిస్తారు. ఈ రకమైన భావాలు, వారికీ నాకూ ఉన్న అనుబంధాన్ని బలపరుస్తున్నది. దానికి చిహ్నంగానేమో శ్రీమన్నవ బుచ్చిరాజు శర్మ (రాజుబావ) గారికి ఈ గ్రంథాన్ని అంకితం చేస్తున్నారు వారు.

"రాజుబావ" 1954లో మొట్టమొదటిసారిగా జిల్లెళ్ళమూడిలో అమ్మదర్శనం చేశారు. 1958మార్చి 30న, అమ్మ దివ్యచరణ సన్నిధిలో, అమ్మ కనుసన్నలలో, వ్యక్తిగత పర్యవేక్షణలో, వారి వివాహం జరిగింది. ఇది అమ్మ చేతుల మీదుగా జరిగిన నాకు తెలిసిన మొదటి వివాహం. అమ్మసేవకే అంకితమైన "ప్రభావతి" అక్కయ్య అమ్మను వంటింటి బాధ్యతల నుండి తప్పించిన ప్రథమవ్యక్తి. ప్రభావతి అక్కయ్యతో పరిణయంతో మన్నవ బుచ్చిరాజుశర్మగారు మా అందరికి, అందరింటికీ కూడా రాజుబావగా చలామణి ఐనారు. నాకు, హైమకు వారిరువురూ అమ్మ పక్షాన మా బరువు బాధ్యతలు స్వీకరించిన, మాకు తెలిసిన మొదటి బంధువులు. అమ్మ జీవిత సంఘటనలలోని కొన్ని ఘట్టాలకు

రాజుబావ ప్రత్యక్షసాక్షి. ఆయన అంతరంగంలో మెదలిన అనుభూతులకు రూపమే అమ్మపై ఆయన కలంనుండి జాలువారిన పాటలు. అమ్మ తత్త్వరహస్యాన్ని నింపుకొని లోకం చూచిన ప్రథమ సాహిత్యం రాజు బావ పాటలే -వాటికి అమ్మ ఆమోద ముద్రకూడా ఉన్నదన్నది లోకవిదితం. అందుకేనేమో అన్నమయ్య పదసాహిత్యానికి మురిసిపోయి ఆయనను వెంకటేశ్వరస్వామి వారు పల్లకిలో ఊరేగించిన ఘట్టం, రాజుబావ కళ్యాణంలో అమ్మ, వారి కళ్యాణ పల్లకీ ప్రక్కన నడిచిన తీరుగా, నా కనుల ముందు మెదలుతున్నది.

శ్రీ శాస్త్రిగారు, రాజుబావ వంటి హితులు, సన్నిహితులు ఇద్దరు ఆత్మీయుల మధ్య ఏర్పడుతున్న ఈ గ్రంథానుబంధం నాకీ రెండు ముక్కలు ముందు మాటలుగా వ్రాసే అవకాశాన్ని కల్పించింది.

బ్రహ్మాండం రవీంద్రరావు



1958 సంవత్సరంలో శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారు, శ్రీమతి ప్రభావతి అక్కయ్యల వివాహం జిల్లెళ్ళమూడి అమ్మ తన చేతులమీదుగా జరిపించిన సందర్భంగా తీసిన అపురూప ఫొటో. భావితరాలకు కానుక.

బొప్పూడి రామబ్రహ్మము
అధ్యక్షుడు, శ్రీవిశ్వజననీపరిషత్
జిల్లెళ్ళమూడి

విజయవాడ
08/03/2007

గేయ సాహిత్యంలో నక్షత్రాలు

'పదార్చన, ద్వితీయభాగం' ప్రతిని పంపిస్తూ నా అభిప్రాయం వ్రాయమని కోరారు సత్యనారాయణశాస్త్రి అన్నయ్యగారు. నాకు సంగీతంలో ఎ,బి,సి,డి,లు రావు. సాహిత్యంలోను అంతంతమాత్రం ప్రవేశమే. అధ్యక్షునిగా నాలుగు మాటలు చెప్పవలసిన బాధ్యత నాపైన ఉన్నది.

అన్నయ్యగారు సుప్రసిద్ధ నవలారచయిత, భవన్స్ ఇనిస్టిట్యూట్ వారిచే వారి గ్రంథాలు ప్రచురింపబడినవి అంటే, ఆయన రచనల యొక్క విలువలు ఎంత గొప్పవో, వేరుగా చెప్పనవసరం లేదు. 'పదార్చన' మొదటిభాగం ప్రచురించి, దానిని సంగీత స్వరకల్పనతో వినిపించి వీనుల విందు చేశారు. ఆయనకు రాజుబావ గారి యందు అనురాగం, ప్రేమ, ఎంతో భక్తి. ఆయనను ఒక ఆదర్శంగా తీసుకుని రచన సాగించారు. తనకు ఎంతో తపన, తన భావాలను నలుగురితో పంచుకోవాలని తాను ఎంతో సాధనతో ఏకాగ్రతతో ఉన్నప్పుడు వెలువడే పదాలనే వ్రాసుకొంటారు. అదే ఆలోచనగా కొన్ని రోజులు తనలో తనే పాడుకుంటారు. అలా వచ్చిన ఈ గీతాలు ఆయన హృదయ స్పందనలు.

మైల పులుముకున్న
బాలుని గతి నాది
అమ్మవలెనను కడిగి
అంటు తొలగింపవా!
'ఎదురొచ్చి నను చేకొనవా!

వ్యధలు నిండిన బ్రతుకులే ఇవి, అని అమ్మను అర్థిస్తారు, ప్రాధేయపడతారు, మధన పడతారు.

తత్త్వవేత్తలా "ఉవిదలన్నా చిన్న చూపు మానకున్నా ముప్పురా!" అని హెచ్చరికలు చేస్తారు.

అన్నయ్యగారు చెప్పుకున్నట్లు, పాటలు ఆయన వ్రాయరు. అవి వాటి అంతట అవిగా రావాలి.

జిల్లెళ్ళమూడి అమ్మను,

'సకలాధారమునీవే

సర్వాధారము నీవే"

అని మనసా, వాచా, కర్మణా నమ్మిన వ్యక్తి అన్నయ్యగారు.

తెలియని తనము తొలగు నెలా? తలపులు మదిలో తెగునదెలా?

అని అమ్మ నామస్మరణతో, అమ్మరూపధ్యానముతో సతతము జీవిస్తున్న వ్యక్తి అన్నయ్యగారు.

ఒక్కొక్కసారి విజ్ఞాన పూతమై, ఉపనిషత్సారమై ఉంటాయి ఆయన పాటలు.

'ఈసృష్టియంతా బ్రహ్మ తప్పే, నీకు నాకు ముప్పురా"

అమ్మ, మనకు "కర్మ ప్రభావము కాదు, తప్పు అంటూ ఉంటే ఆ బాధ్యత అంతా నాదే" అన్న మాటను ఎంత చక్కగ చెప్పారో చూడండి.

'ఇది ఏమి అవతరణ మమ్మా! నీది" గేయములో అమ్మను గురించి చక్కగ చెప్పారు.

అన్నయ్య గీతాలు అందరికీ అర్థమవుతాయి. ఇవి గేయ సాహిత్యంలో నక్షత్రాల వలె ప్రకాశిస్తాయని ఆశిద్దాం.

ఇట్లు

అమ్మసేవలో,

భవదీయుడు

బొప్పూడి రామబ్రహ్మము

అభినందన చందనము

పురుషోత్తమపుత్రభార్గవ
పి. ఎస్. ఆర్. ఆంజనేయప్రసాద్

ఈ గ్రంథ రచయిత సత్యనారాయణశాస్త్రిగారు గౌతమ సగోత్రీకులు. అమ్మ పుట్టింటివారిది కూడా అదే గోత్రం. అందువల్ల తాము జిల్లెళ్ళమూడి అమ్మకు సగోత్రీకులం అన్నారు. అమ్మ వివాహం అయిన తర్వాత గోత్రం మారి శ్రీవత్స సగోత్రం అయింది. నేను కూడా అమ్మా నేను సగోత్రీకులం అనవచ్చు. కాని నేను మాత్రం మనందరిదీ 'మాతృశ్రీ గోత్రం' అనే అంటాను.

శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని రాజుబావకు అంకితం చేస్తున్నారు. రాజుబావతో నాపరిచయం కూడా స్వర్ణోత్సవం చేసుకోబోతున్నది. తొలినాటికీ, ఈనాటికీ రాజుబావలో ఏరకమైన మార్పులేదు. ఆ ఆప్యాయత, ఆ ప్రేమ, ఎప్పుడు కనిపించినా నాపట్ల చూపుతూనే ఉన్నారు. చమత్కారంగా ఉండే రాజుబావ మాటలలో అమ్మతత్వం, అమ్మ మాటల పట్ల విశ్వాసం స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది.

ఈ గ్రంథం పేరు పదార్చన. ఎవరి పదార్చన, మాతృశ్రీ పదార్చన అందామా? అమ్మ మీద కాక ఇంకా చాలమంది దేవుళ్ళ మీద రచనలున్నాయే. అందరి పదార్చన అందామా? అసలు ఏపాదాలు పూజించినా నా (ఆ) పాదాలకే అందుతాయి అన్నది అమ్మ. "అది" కానిది మరొకటి కన్పించటం లేదు అన్నది కదా! కనుక అన్ని పాదాలు తన పాదాలుగా భావించిన అమ్మకే అనుకుందాం ఈ పదార్చన.

ఇక గ్రంథంలోకి తొంగిచూస్తే 24శీర్షికలున్నాయి. ఇందులో కృతులు 3, తంబురాతత్వాలు 9, జావళీ 1, అయ్యప్ప పాటలు 2, అమ్మమీద వ్రాసిన పాటలు 8, అమ్మ సచ్చరిత్ర ప్రారంభగేయం 1ఉన్నాయి.

గణేశస్తుతి మొదటిది. "సర్వారంభములకు ముందు హేరంబుని కొలచిన ఉర్వినిజనులెల్ల సర్వశుభములు పడయగ" ఇది శాస్త్రిగారి భావన. "అలనాడు పాల్కడలి తరచువేళ తొలిపూజ పొందు ఈ వేల్పుల పెద్దకు సురాసురులు మ్రొక్కులిడగ అమృత సిద్ధి, లక్ష్మీప్రసన్నత కలిగెకదా" అన్నారు. ఏదైనా అర్హులకే కదా లభించేది. సురాసురులు మ్రొక్కులిడగ సురలకు మాత్రమే అమృతము - లక్ష్మీప్రసన్నత దక్కాయి, అసురులకు

దక్కలేదు మరి. ఏమైన గణేశపదార్చన ముందుగా చేయటం సంప్రదాయమే. శాస్త్రిగారు ఆదితాళంలో హంసధ్వని రాగంలో దీనిని కూర్చారు. అమ్మ ఆదెమ్మ, అమ్మ పరమహంస, అమ్మ నడక హంసనడక. ఆ హంసనడకలో వచ్చే శబ్దం హంసధ్వని. శాస్త్రిగారి రాగతాళాల ఎన్నిక ఎంతో శాస్త్రీయంగా ఉన్నది.

"ఎదురుపలికే వారెవరూ లేరనా" ఎట్టి ఆలోచనలు చేశావురా! పరమేశ్వరా!" నీది సనాతనము, శాశ్వతము అయిన తత్త్వము. ఈ మహత్తరమైన సృష్టికార్యాన్ని చేసిన బ్రహ్మకు కూడా తెలియరాని తత్త్వం నీది. ఆ నీ గహనమైన తత్త్వాన్ని ఎరుకపరచి మా చింత తీర్చమని ఎంత చనువుగా అర్థించారో శాస్త్రిగారు పరమేశ్వరుని. ఆ చనువు అమ్మవద్ద లభించిందే ఆయనకు. వివాదరహితమైన పరమేశ్వరుడెవరో కాదు – **అమ్మే.** ఎందుకంటే అమ్మది సరే తత్త్వం. ఎవరితోనూ వాదం చేయదు. ఎవరినైనా, దేనినైనా ఆమోదించటమేతప్ప. అమ్మ దర్బారులో ఆలపించేరాగం సర్వసమ్మతమైన అనురాగమే.

మరొక కృతిలో నిఖిల లోకాధారుడవైన నీవు విష్ణువువా? శివుడవా? ఎవరని నిన్ను కొలిచేది? లేక ఈ నేలా నింగీ అన్నిటా నిండిన తత్త్వానివా? చైతన్యతేజానివా? అని ప్రశ్నిస్తారు. అంతమాత్రాన శాస్త్రిగారు తత్త్వరహస్యం తెలియనివారు కారు. సత్యం జ్ఞానమనంతమైన బ్రహ్మను ఎరిగినవాడు, సర్వవిధములైన కామములు పొందుతాడు. అసలు పొందవలసింది ఏదీ లేదు అని తెలుసుకుంటాడు అని తైత్తరీయోపనిషత్తులోని ఆనందంవల్లిలో ఈ విషయం చెప్పబడి ఉన్నది. ఆత్మనుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీరు నుండి నేల, నేల నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నము, అన్నము నుండి పురుషుడు, ఆ పురుషుడు అన్నరసస్వరూపుడు. ఇది సృష్టిక్రమ రహస్యం. అమ్మ కూడా ఒకటే అయిదుగా పంచబడ్డవి కనుక పంచామృతాలు అని పాలు, పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి అని చెప్పింది. ఒక భూతమే అయిదుగా పంచబడి పంచభూతాలైనవి.

అయితే శాస్త్రిగారు నామరూపమే లేని సర్వనామమా నీవు? అంటారు. నామము రూపము ఉంటేనేగా ఒకటో అనేకమో నామాలుండేది. ఒకటే అనేకమై అనేకము ఏకం కావటానికి జరిగే చక్రనేమి క్రమమే సృష్టిరహస్యం. ఆ విషయం ఈ కృతిలో చెప్పారు శాస్త్రిగారు. అందుకే అమ్మ అన్నది అన్ని నామాలు వాడివే కనుక నామరహితుడని, అన్ని రూపాలు వాడివే కనుక రూపరహితుడని, అన్ని గుణాలు

వాడివే కనుక గుణరహితుడని, అన్ని సంకల్పాలు వాడివే కనుక సంకల్పరహితుడని.

దేశకాలాతీతమైన శక్తి "సహస్రశీర్షాపురుషః సహస్రాక్షః" అంటే వేయితలలతో, వేయికన్నులతో, వేయి పాదాలతో కనిపిస్తున్నాడు. సహస్రమంటే వేయి అనే కాదు, లెక్కలేనన్ని అని అంటే అంతటా, అన్నిటా, అందరిగా తానై ఉన్నవాడన్నమాట. విశ్వమంతా తానైన పరమాత్మ కూడా ఈ చిన్నశరీరంలో ఇమిడిపోయి ఉన్నాడు. ఎలా విరాట్‌స్వరూపుని కొలిచేది? సాధ్యమా? అంటారు శాస్త్రిగారు. నిజమే "నా రుద్రః రుద్రమర్చయేత్' అంటారుకదా! రుద్రుడు కానివాడు రుద్రుని అర్చించలేడని. అందుకే మహన్యాసము.

నిజమే ఏనుగంత ఉన్నావు తేలు మంత్రం రాదా? అంటే ఎలా తెలుస్తుంది. ఆ మంత్రం సాధించి సిద్ధించుకొన్న వానికి తెలుస్తుంది. అమ్మ అందుకే "మీలో నేను దైవత్వాన్ని చూస్తున్నాను. మీరు నాలో మానవత్వాన్ని చూస్తున్నారు" అన్నది. ఆమే దైవం కనుక 'అది' తప్ప ఇంకేదీ కనిపించడం లేదు అమ్మకు. మనం మానవులం కనుక మనకు మానవత్వం తప్ప మరేమీ కనిపించడం లేదు. మనం కూడా దైవమే అని గుర్తించేటట్టు చేయడం కూడా ఆమె పనే. అప్పటిదాకా అంటే, ఈ ద్వంద్వ భావనలో ఉన్నంతకాలం, అమ్మదైవం మనం మానవులం. అందుకే శంకరులు "దేహబుద్ధ్యా భవద్దాసః జీవబుద్ధ్యా త్వదంశకః, ఆత్మబుద్ధ్యా త్వమేవాహం, ఇతిమేనిశ్చతామతిః" అంటారు. దేహబుద్ధితో నేను నీ దాసుడ్ని, జీవబుద్ధితో నేను నీ అంశను, ఆత్మబుద్ధితో నాలో ఉన్నమాయ తొలగిపోతే "నేనే నీవు నీవే నేను" బ్రహ్మను. ఆ స్థితి వచ్చేదాకా, ఆ అనుభూతి వచ్చేదాకా ఈ పాటలు, పద్యాలు తప్పవు. ఏ రామకృష్ణ పరమహంసకో, ఏ సదాశివబ్రహ్మేంద్ర సరస్వతికో, ఏ రమణ మహర్షికో వచ్చిందంటారు. అమ్మను మనం ప్రత్యక్షంగా చూచాం. భగవంతుడు-అవతారాలు వేరు, బ్రహ్మానుభవం వేరు. అది అపరోక్షం.

శాస్త్రిగారు పై మూడు కృతులలో సంప్రదాయ వేదాంతాన్ని, తత్త్వరహస్యాన్ని పిండటానికి ప్రయత్నించారు. అమ్మ అతి తేలిక మాటలలో తన అనుభవాన్ని రంగరించి, వెన్నముద్దలు తీసి తినిపించింది మనచేత. ఒక పువ్వును చేతికి తీసుకొని దీనిలో కాడ, పువ్వు రేకులు అన్నీ కలిపితే అద్వైతము, విడదీస్తే ద్వైతము అన్నది. ప్రజ్ఞానం బ్రహ్మైతే, అజ్ఞానం ఎందుక్కాదు? అన్నం పరబ్రహ్మమయితే, అశుద్ధమో? అన్నది. వేదాంతం అంటే అనుభవం. దానంతట అదే, సమయం వస్తే తెలుస్తుంది. 'అనుభవం

శాస్త్రాన్నిస్తుంది, కాని శాస్త్రం అనుభవాన్నివ్వదని' తేల్చి చెప్పింది.

"ఈ జన్మమిక దుర్లభమురా" "తొమ్మిది చిల్లుల తోలు తిత్తి ఇది తుస్సుమనుట ఖాయం" వంటి తత్త్వాలను మనం పూర్వం విని ఉన్నాం. శాస్త్రిగారు కూడా కొన్ని తత్త్వాలు వ్రాశారు. పరా - పశ్యంతి - మధ్యమములు దాటి వైఖరీ రూపంలో శబ్దం జీవి నుండి బయటకు వస్తున్నది. అసలు శబ్దం ఈ పాంచభౌతికమైన శరీరంలో, నీటి బుడగవంటి జీవితంలో ఎక్కడనుండి పుట్టుతున్నది? ఆ కులుకులాడి ఏ రకంగా బయటపడుతున్నది? దాని గట్టితనము ఓటితనము కనిపెట్టమంటారు శాస్త్రిగారు. ఈ మట్టికొంపన (శరీరం) మాటవచ్చే (వాక్స్థానం) చోటు (నాభిస్థానం) కనరయ్యా! అని హెచ్చరిస్తారు.

మాటలకు అందనివాడు, దిక్కులేనివాడికి దిక్కైనవాడు అయిన అష్టమూర్తీ! వామదేవా! నీవే దిక్కు. గాజు పూసలవంటి పలుకులతో విలసిల్లే ఈ మనసులన్నీ నీ సృష్టి. విశాలమైన నీ సృష్టిలో ఎక్కడ భూమి మీద మా మనుగడ? నీవేమో విశ్వమంతా నిండిన విశ్వనాథుడవు. నీవు ఒక కాపుకాచువాడవని నీకు దోసిలొగ్గి యున్నవాడ అంటారు. శరణాగత లక్షణం ఇది.

కామ,క్రోధ,లోభ, మోహ, మద మాత్సర్యాలు, తామస రాజస గుణాలు, భగవంతుని నుండే మనకు సంక్రమించాయి. "వాడి"కి లేనివి మీ కెక్కడివిరా" అన్నది అమ్మ. చైతన్యప్రదాతా! నీ వాడే ఆటలో నీవల్లనే ఇవన్నీ నాకు సంక్రమిస్తుంటే నాదోషమేముంది ఇందులో? నా నిజస్థితి, సుస్థితికి నన్ను నెట్టడం కూడా నీ పని. ఇందులో రహస్యమేమిటంటే అంతా "వాడి లీల" అని తెలుసుకోవడం? మన కర్తృత్వం ఏమి లేదనే, ఎరుక ప్రధానంగా ఇక్కడ వివరించబడింది.

"ఏడుకొండలస్వామికి వేడికోలు చెప్పుకో!" అన్నారు శాస్త్రిగారు. ఎవరా ఏడుకొండలస్వామి? మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలు దాటి సహస్రారంలో కొలువై ఉన్నవాడు. వాడికి వేడి వేడి బ్రతుకుల వాడిపోని కతలు చెప్పాలిట. చెప్పాలంటే, అక్కడకు వెళ్ళాలి కదా! ఆ ప్రయాణం చేయాలి. ఈ కాడియెద్దుల సంసారం, ఈ బానిసబ్రతుకులు, శరీరం మీద మోహం పోవటం లేదు, మనసు భ్రమ ఆగటం లేదు. మూలాధారంలో కుండలినీ లేవటం మొదలైతే వెలుగులు నిన్ను ఆ కొండలకోనేరైన సహస్రారానికి త్రోవచూపుతుంది. ఆ మార్గంలో

ఎట్టానన్నా ఆ మెట్లెక్కు అంటారు శ్రీశాస్త్రిగారు.

అమ్మ "సృష్టికన్నా వింత ఏముందిరా? మహాత్మ్యం ఏముందిరా?" అన్నది. త్రాడు పాముగా కనిపించడం భ్రమ. పాము త్రాడుగా కనపించుటమూ భ్రమే. ఈ సృష్టి సత్యంగా కనిపిస్తున్నది. అసత్యంగా అనిపిస్తున్నది. అదీ భ్రమే. "కనిపించేది కనిపించనిది అంతా బ్రహ్మమే" అనే సత్యం తెలిస్తే భ్రమలేదు "భ్రమ పోతే అంతా బ్రహ్మమే", ఈ సత్యాన్ని తీసుకొని శాస్త్రిగారు పెద్ద బెమ, చిన్న బెమ, బుల్లి బెమ అంటూ జానపదుల భాషలో తత్త్వాన్ని చిత్రీకరించారు. ఈ మాటనే కురుమద్దాలి పిచ్చమ్మగారు ఈ భాషలోనే చెప్పారు.

"పిల్లవాడు బురద త్రొక్కివస్తే కడగి శుభ్రం చేసే బాధ్యత తల్లిది" అన్నది అమ్మ. జీవుడు-దేవుడు భిన్నంగా లేరు. కలిసే ఉన్నారు. అడ్డదిడ్డంగా అడ్డదారులు త్రొక్కితే చెడ్డవాడని ఎంచటం విడ్డూరం. వ్యధలు నిండిన బ్రతుకైనా విధివిలాసం అని వదిలివేయటం ధర్మం కాదు. ఎదురు వచ్చి నన్ను చేకొనవా? అలిసి సొలసిన బ్రతుకుకు సేదతీర్చే బాధ్యత నీదే అని బ్రతిమలాట భగవంతునితో-

సరస్వతీ స్వరూపుడైనా, కుబేరుడైనా చింత వదలటం లేదు - ఈ సృష్టిలో "ఇతరులకున్నది, తనకు లేదు అనే చింతలు రెండే మానవులకు" అన్నది అమ్మ. భగవాన్! ఎంతైనా నీ సృష్టే చింత. నీ గుణమేమిటో, నీ రూపమేమిటో తెలియక వాదులాటలు. ఆది, తుదిలేని అసలు స్థితి ఎవరికీ తెలియదు. "యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసః " కదా! వాక్కులు మనస్సు నిలచిపోయింతర్వాత కదా అది యేమిటో తెలియటం మొదలయ్యేది. ఈ ఉభయ వేదాంతాలు అక్కడ పనిచేయవు.

"కలౌ నామసంకీర్తనం" అన్నారు పెద్దలు. "కృతే యద్ధ్యాయతో విష్ణుం - త్రేతాయాం యజతో మఖైః - ద్వాపరే పరిచర్యాయాం - కలౌ తద్ హరికీర్తనాత్" అని భాగవతం చెబుతున్నది. కృతయుగమున భగవధ్యానము, త్రేతాయుగమున యజ్ఞారాధన, ద్వాపరమున అర్చనాదులు, కలియుగమున భగవన్నామ సంకీర్తనము తరణోపాయములు. నామస్మరణాత్ అన్యోపాయం - నహిపశ్యామో భవతరణే" జన్మతరించడానికి నామస్మరణ కన్న వేరైన ఉపాయం లేదు. అందుకే శాస్త్రిగారు "ఏమి నామము - ఏమి నామము - ఏమి నామము - రామనామము" అంటూ ఆ నామ మాధుర్యంలో తేలిపోతారు. రామాయణమంతా గుదిగుచ్చారు ఒక గేయంలో.

రాగమాలికతో శాస్త్రిగారు ఒక జావళీ వ్రాశారు. స్త్రీమోహము బ్రహ్మంత వాడ్నికూడా వదలలేదనీ, కూతురువరుస అనికూడా చూడకుండా సరస్వతీదేవిని చెట్టబట్టాడనీ, శివుడు తల నరికినా బుద్ధిరాలేదనీ, అడ్డదిడ్డమైన ఈ సృష్టి అంతా బ్రహ్మదేవుడి తప్పేననీ, వాసవాదులు చేసే తప్పులే మానవులను ముప్పతిప్పలు పెట్టుతున్నాయనీ, గోకులంలో నందగోపుని ముద్దుపట్టి యొక్క నిర్మోహ నిష్కామ శృంగారం, రాసక్రీడ, నిజమైందని. అటువంటి దానిని అందుకోవాలని శాస్త్రిగారు తపనపడ్డారు.

అయ్యప్పపై వ్రాసిన రెండుపాటలలో మండల దీక్షలు, పడిపూజలు తలచారు. గజాననునికి, షడాననునికి సరియైన తమ్ముడు అని భావించారు. పరమ శాంతస్వరూపుడు, ప్రీతిస్వరూపుడు అయ్యప్పను నాభికమలం నుండి వచ్చే తన పలుకులు విని బ్రోవమంటారు.

అమ్మను నవఖండికలతో అర్చించుకున్నారు శ్రీశాస్త్రిగారు. అందరిలో ఉన్న "నేను" లన్నీ కలిసిన పెద్ద 'నేను' అమ్మ. అందుకే "అన్ని నేనులు నేనైనా నేను" అన్నది. అమ్మరూపం ధరించటంతో విశ్వమంతా వెలుగు వెల్లువలు ప్రసరించాయి. భూమి, ఆకాశం, కలలో, ఇలలో, సహస్ర బాలసూర్యప్రభాభాసమైన కాంతి. అమ్మ వెలుగుకే వెలుగు.

అమ్మ పొత్తిళ్ళలో ఎదుగుతూ, అమ్మ పాలు త్రాగుతూ, అమ్మ చదువులే చదువుతూ, అమ్మ తలుపులే తలుస్తూ, అమ్మ ధ్యానమే చేస్తూ, అమ్మగీతమే పాడుతూ, అమ్మే సర్వమనిపించి, అమ్మకంటే వేరు లేదనిపించి అమ్మదీవెనలు పొందుతూ, అమ్మకడుపు పంటగా పండిపోవాలని శాస్త్రిగారి ఆశ. అమ్మ ఎప్పుడో అనుగ్రహించింది, మనదే ఆలస్యం.

అమ్మ కన్నులలో సూర్యచంద్రులున్నారు. చందురుని వలె అందమై చల్లదనాన్ని ఒలికే కన్నులు అమ్మవి. ఫాలభాగంలో ఎర్రని సూర్యబింబం వంటి తిలకం. పెదవులపై చిరునవ్వు, బిడ్డలందరినీ అన్నం తినమనే చేతిముద్ర, హంసగమనం ఇవన్నీ శాస్త్రిగారు అమ్మలో సందర్శించిన సొగసులు. అమ్మచూపే ఆ వాత్సల్య సౌందర్యంలో ముగ్ధులైన శాస్త్రిగారి మనసంతా అమ్మ రూపమే! అమ్మ కళ్ళే – అదొక మహద్భాగ్యం. ఆ మాయలో అమ్మ వద్దకు ఎందుకు వచ్చామో కూడా మరచిపోతాం.

"ఆధారం ఆధారమైతే అంతా సహస్రారమే" అంటుంది అమ్మ. జగాలకు, యుగాలకు సర్వాధారమైన అమ్మకు లోకాలు జీవులు, సృష్టి, పోషణ నాశనము అంతా సహజమే. 'ఈ కలిలో నా కాకలి లేదు" అన్న అమ్మ మన ఆకలి తీర్చటానికి తాపత్రయ పడేది.

మానవుడు తన సంగతి తనకు తెలియకుండానే జీవితమంతా గడిపేస్తాడు. ఈ తెలియనితనం తొలగేదెలాగ? మనసులో వచ్చే తలపులు తెగేదెలా? ఇది అసలు సమస్య. ఆలోచనలు ఆగిపోయి ఎరుకలో ఉండిపోయే స్థితిని భావించారు శాస్త్రిగారు. ప్రశాంతమైన నిద్దుర, హృదయంలో నిశ్చింత, మాయను కడిగిన మనస్సు, నిరంతర నామస్మరణ, ధ్యానము చివరకు అమ్మే తాను, తానే అమ్మ అయ్యేదెలాగు? అంటారు శాస్త్రిగారు. దీనికి అమ్మ పురుష ప్రయత్నం లేదన్నది, మీ చేతలు మీ చేతుల్లో లేవన్నది. మంచీ చెడూ వాడిదయేనన్నది. నీకా ఆలోచన ఇచ్చింది వాడేగా వాడే తీరుస్తాడు అన్నది. ఆ వాడు, పురుషుడు అమ్మే.

"నా తెలంగాణ కోటిరతనాల వీణ" అన్నాడు దాశరథి. శాస్త్రిగారు "అమ్మ మాట కోటిరతనాల మూట" అంటూ పంచరత్నాలు తీసి చూపారు. ఒకటి "నేను నేనైన నేను', రెండు 'మీదేమీ లేదు - 'బిడ్డల బాధ్యత తల్లిదే', మూడు 'ఇది అది' కాకపోతే గదా! నాలుగు 'మీరంతా నా బిడ్డలే' (నీకు, మీకు, అందరికి అమ్మను) ఐదు 'మంచికి ఏది కారణమో చెడుకూ అదే కారణం'. అమ్మ మాటలన్నీ రతనాలే. అయినా ఈ ఐదు కోహినూర్ వజ్రాలన్నమాట.

మంచీ చెడులు, పూజలు, తిరస్కారాలు, అన్నీ సర్వసమత్వబుద్ధితో చూచే మనస్సు అమ్మది. తల్లికితప్పే కనిపించదని, కనినవారికి, కననివారికి కూడా సుగతేననే అమ్మ ప్రేమావతారం అని శాస్త్రిగారి నిశ్చయం. అమ్మ రూపం సుందరం, చరిత్ర సుందరం. అసలు సౌందర్యానికి సుందరత నిచ్చిందే అమ్మ.

విధి అంటే విధానమే. విధి అంటే దైవం. అమ్మది విధిని మించిన తత్వం. అమ్మది సహజసహనం. వీటిని వివరించటానికి అమ్మ జీవితంలోని కొన్ని సంఘటనలను చిత్రించటానికి ప్రయత్నించారు శాస్త్రిగారు. పాములతో ఆటలు, విషాన్ని మ్రింగటం, సలసలమండే పొగాకు బేరన్‌లో కమిలిపోవటం వంటివి ఉదహరించి 'ఇది ఏమి అవతరణమమ్మా! ఎప్పటిదానవో? ఈ రాక ఏలనో? అని ప్రశ్నిస్తూ ఏ జన్మ పుణ్య

ఫలమో నీ సేవ దొరికింది అంటారు. ముగ్గురు మూర్తుల మించినతత్త్వం అమ్మది అని నిర్ధారిస్తారు.

నిజానికి 24గేయాలు శాస్త్రిగారు వ్రాయటంలో గాయత్రీమంత్రం మనసులో మెదిలిందేమో – అమ్మ గాయత్రీ మాతయే కదా! 25వది ప్రణవం.

ఇక శాస్త్రిగారు చాల గ్రంథాలు వ్రాశారు. అమ్మను గూర్చి "తెలుగులో మహావాక్యం" అన్న గ్రంథం వ్రాశారు. పదార్చన మొదటి భాగం ఇలాంటిదే ఇదివరకు వెలువడింది. ఇక శాస్త్రిగారు వచనంలో, గేయంలో కూడా సిద్ధహస్తులే. ఆధ్యాత్మికం వంటబట్టిన విద్య కనుక అన్నింటిలోనూ దాని వాసనే, రకరకాల భంగిమల్లో కనిపిస్తుంది. ఈ పదార్చన శ్రీశాస్త్రిగారి మనఃపదార్చనే కనుక నాకు సర్వత్రా అమ్మ మాటలు, అమ్మే కనిపించింది. నాకు తోచిన, అమ్మతోపించిన మాటలు నాలుగు వ్రాశాను. అందరమూ అన్నాతమ్ముళ్ళమే కనుక ఇది అమ్మకు పట్టిన హారతిగా, శాస్త్రిగారికి ఇచ్చిన అభినందన చందనంగా భావించవచ్చు.

జయహోమాతా

శుభకామన

నిజానికి ఇది పదార్చన మూడవ భాగం అనిన ఆశ్చర్యమా? మొదటిది అనేక సుమపరిమళభరితము. శ్రీహైమవతీదేవి ఆలయప్రవేశ చరిత్రాత్మకఘట్టమందు అమ్మనర్చించినది. "లాలిశ్రీమాతృమూర్తీ," "జిల్లెళ్లమూడిలో స్త్రీరూపధారణియై"వంటి పాటలు మొదటి సంకలమునకు చిరస్థాయిని చేకూర్చినవి.

అప్పటికే రాజుబావ పాటలు గ్రంథరూపములో రాకపోయినను జిల్లెళ్ళమూడి వచ్చు వారందరూ పాడుకొనుచుండెడివారు. అమ్మ సాహిత్యమునకు రాజుబావయే ఆదికవి. ఇప్పటికి ఎన్ని గేయకావ్యములు వచ్చినను అనుభవసారమే తలమానికమైనది. ఆయనకు ఈ పదార్చన రెండవ భాగమును శ్రీశాస్త్రిగారు అంకిత మీయదలచుట అమ్మధ్యాసలో తన జీవితమును పండించుకొనుచున్న ఋషితుల్యుని సన్మానించుటయే! గొప్పపని!

అమ్మగురించి ఎంత చెప్పినను వెలితిగనే ఉండును. అందువలన ఇచట మౌనమే శరణ్యము. ప్రస్థానత్రయాధ్యయనము చేసి, అమ్మ సాన్నిధ్యమందు అపరోక్షానుభూతి కభిన్నమగు అనుభవములు పొందిన శ్రీశాస్త్రిగారిని గురించి చెప్పబూనుటయు సాహసమే.

పదార్చన రెండవభాగము రాగతాళలయాన్వితము. సంగీతానభిజ్ఞుడైన నేను వానిలోని స్వారస్యమును చెప్ప నర్హత లేని వాడను. అందలి వస్తువు అమ్మ. అమ్మను గురించి గొప్పగా పలికిరి. పరతత్త్వము గ్రంథమంతయు ఓతప్రోతముగా నున్నది. వేదాంతశాస్త్రమును పుక్కిటబట్టిన శ్రీశాస్త్రిగారు అమ్మ సచ్చరిత్రను గేయరూపంలో వెలువరింప పూనుకొనుట మరియొక శుభపరిణామము. సాంకేతిక పదజాలములలోనికి సాధ్యపడినంత కొలదిగా పోయి, పండితపామరులకెల్లరకు సుబోధకమగు రీతి అమ్మ సచ్చరిత్ర ఉద్భవించుగాక.

బ్రహ్మశ్రీ బులుసు లక్ష్మీ ప్రసన్న సత్యనారాయణ శాస్త్రిగారు వ్రాసిన, వ్రాస్తున్న వ్రాయబోతున్న గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. అమ్మ కృపావిశేషం వలన వారన్నింటిలో కృతకృత్యులౌతారని, వారి గ్రంథాలన్నీ అచిరకాలంలో ముద్రింపబడుతాయని, వారి మనోభీష్టాన్ని అమ్మ తప్పక అనుగ్రహింపగలరని, వారికి, వారి కుటుంబసభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, సకలభోగభాగ్యాలను చేకూర్చవలసిందిగా అమ్మను ప్రార్థిస్తూ శ్రీశాస్త్రిగారికి జయం పలుకుతున్నాను.

తంగిరాల కేశవశర్మ

రాచర్ల లక్ష్మీనారాయణ
Flat No. F1, Sri Venkateswara Towers,
6th Lane, Chandramoulinagar
గుంటూరు

గుంటూరు
15-07-2007

జగన్మాత - జగద్గురువు

శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యన్నారాయణ శాస్త్రి అన్నయ్య గారికి,

మీరు కంచివారికి వ్రాసి, నాకు కాపీ వేసిన ఉత్తరం చేరింది. సంగతులు తెలిసినవి.

మీరు "పదార్చన ద్వితీయ భాగం" గేయకావ్యానికి కూడా నన్ను అభిప్రాయం వ్రాయమన్నారు. దానిలో కూడా పెద్ద స్వామివారు జిల్లెళ్ళమూడి అమ్మకు ప్రణమిల్లిన సంగతి గురించి తెలియజేయమన్నారు. గుర్తు ఉంది.

మీ ఉత్తరం చూసిన తరువాత ఈ రెండు మాటలు వ్రాయాలని తోచి, తెలియజేస్తున్నాను.

తేదీలు గుర్తులేవు. 1975 ప్రథమార్ధంలో జిల్లెళ్ళమూడి అమ్మతో కలసి మద్రాసు, తిరువణ్ణామలై, కలువాయి, తిరిగి మద్రాసు నగరం చేరిన యాత్రలో పాల్గొనే అదృష్టం కలిగింది.

అమ్మ, తిరువణ్ణామలైలో గుడిపాటి వేంకటచలాన్ని చూడటానికి వెళ్ళింది. అక్కడకు చేరి, అతన్ని ఆశ్వాసించింది. బట్టలు పెట్టింది అమ్మ చూపిన కరుణకు ఉప్పొంగిపోయి చలం అమ్మ వళ్లో తలపెట్టుకుని ఏడ్చాడు. అమ్మ అతన్ని సేదతీర్చింది. తరువాత అక్కడున్న సౌరిస్‌తో "అన్నం మానేసినంత మాత్రాన యోగం కుదరదు. స్వల్ప ఆహారం అయినా తీసుకుంటూ యోగం చేయి" అని చెప్పింది. ఆ రోజులలో సౌరీస్ యోగాన్ని అవలంభించి, ఆహారం మానేసింది. చిక్కిశల్యమయిపోయింది. అందుకోసం సౌరీసుకు జిల్లెళ్ళమూడి అమ్మ ఈ సూచన చేసింది.

తరువాత అమ్మ శ్రీరమాణాశ్రమం వెళదామంది. ఆశ్రమం వారికి కబురు చేస్తే, అమ్మ రావచ్చు అని కబురుపంపారు. మా బృందంలోనివారందరూ ఒక కారు, ఇంకో మినీ బస్సులో శ్రీరమణాశ్రమానికి వెళ్ళాం. అమ్మకు స్వాగతమివ్వడానికి ఆశ్రమాధికారులుగాని, ఆశ్రమవాసులుగాని ఎవ్వరూ రాలేదు. మేము ముందర వ్యానులోంచి దిగి, అమ్మకారు తలుపుతీసాం.

అమ్మకారులోంచి నెమ్మదిగా దిగి, పది అడుగులు ఆశ్రమంలోకి వేసి, అక్కడ ఉన్న రెండు మెట్లు ఎక్కి ఆశ్రమ ప్రాంగణంలోకి అడుగిడింది.

అంతే, ఆశ్రమ ఆవరణలో విహరించే ఎన్నో మగనెమళ్ళు కేంకారాలు చేస్తూ, అమ్మను చూడగనే వాటి పురులు విప్పి నాట్యం చేయడం ప్రారంభించాయి. అన్ని నెమళ్ళు అమ్మకు ఇచ్చిన స్వాగతసత్కారానికి, అవిపెట్టే క్రేంకారాలకు, అమ్మని చూసి పురులువిప్పి నాట్యం చేసి, కలిగించిన కలకలానికి, ఆశ్రమ ఆఫీసులోనివారు, ఆశ్రమవాసులు అందరూ బయటకువచ్చి, ఆదృశ్యాన్ని చూసి, పరవశించిపోయారు. అమ్మ బృందంలోని వారి అనుభవం వర్ణానాతీతం.

అప్పుడు ఆశ్రమ అధికారులు ముందుకు వచ్చి, అమ్మను కలుసుకుని, మాతృభూతేశ్వరాలయం, మహర్షి సమాధి స్థలం. మహర్షి జీవించియుండగా నివసించిన కుటీరం, వంటశాల, ఆశ్రమం అంతా చూపించారు. చివరకు అమ్మ అనుజ్ఞతో ఆశ్రమాధికారులు, ఆశ్రమవాసులు కలసి ఫోటో తీయించుకున్నారు.

తరువాత అమ్మ కంచి మఠం పరమాచార్యులవారు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారిని చూడాలంది. అందుచేత మా బృందంలోని వారు కంచికి ఫోన్ చేసి, కనుక్కుంటే స్వామి వారు కలువాయిలో మకాం చేస్తున్నారని తెలిసింది.

వెంటనే తిరువణ్ణామలై నుండి నేరుగా మా బృందం ఒక కారు, ఒక మినీ బస్సులో, కలువాయి గ్రామం చేరేసరికి రాత్రి 11.00 గంటల అయింది. అమ్మ మొదట శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారిని చూసింది. అమ్మ వారితో కొద్దిసేపు ఏదో మాట్లాడింది కూడా. తరువాత వారికి ఒక పట్టుచీర బహూకరించారని గుర్తు.

తరువాత అమ్మ పెద్దస్వామి వారిని కలుసుకోవాలని అంది. ఆశ్రమ పరిచారకులు పెద్దస్వామివారు అర్ధరాత్రి స్త్రీలకు దర్శనం ఇవ్వరని చెప్పారు. "నేను వచ్చానని వారికి కబురు చెప్పండి" అని అమ్మ కబురు పంపింది.

ఈ వార్త పెద్దస్వామివారికి చేరడంలో విలంబం జరిగితే, అమ్మ, మేము ఇక తిరిగి మద్రాసు వెళదామని ఉద్యుక్తులమౌతుంటే, స్వామివారు వస్తున్నారని కబురువచ్చింది. అమ్మ ఆగింది. అమ్మతోపాటు మేమూ ఆగాం.

ఆరోజు అర్ధరాత్రి దాటింది. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు దండ సహితులై వచ్చి, అక్కడ ఉన్న గేటు వెనుక ఒక బల్లమీద ఎక్కి అమ్మను చూస్తూ, తమ దండాన్ని, కుడిభుజానికి ఆనించుకుని, రెండుచేతులు జోడించి, ప్రణామం చేస్తూ, పదిహేను నిముషాలు అలాగే నిలబడి ఉన్నారు. అమ్మ, మేము, గేటు ఇవతల ఉన్నాము. ఈ దృశ్యాన్ని మా బృందంలో వారందరం, కొందరు ఆశ్రమ పరిచారకులు కూడా తిలకించారు.

స్వామివారు అమ్మకు అలా నమస్కరిస్తూ పదిహేను నిముషాలు నిలబడి ఉంటే, నామనస్సు పరిపరివిధాల ఆలోచనలు చేసింది. స్వామివారు వచ్చి అమ్మకు దర్శనమిస్తారనుకున్నాను. కాని స్వామివారు వచ్చి అమ్మకు నమస్కరిస్తూ నిలబడితే, స్వామివారే అమ్మను దర్శించుకున్నారనుకున్నాను. స్వామివారు చెయ్యెత్తి ఆశీర్వదించుతారనుకున్నాను. స్వామివారు చెయ్యెత్తి ఆశీర్వదించనూ లేదు. ఆఖరుకు చేతులు వాల్చుకు కూడా నిలబడనూ లేదు. రెండు చేతులు జోడించి దండాన్ని కుడిభుజానికి ఆనించుకుని సుమారు పదిహేను నిముషాలు అలాగే నిలబడి ఉన్నారు.

అమ్మకు ఎడంచేతి ప్రక్కన నేను నిలబడి ఉండడంచే ఇదంతా గమనిస్తున్నాను. పదిహేను నిముషాలు అయిన తరువాత "నాన్నా మనం ఇక్కడ ఉన్నంతసేపు వాడు అక్కడ అలాగే ఉంటాడురా, వచ్చిన పని అయింది" మనం వెళదాం నాన్నా అని అంది అమ్మ.

అక్కడ నుండి మేము కదిలాము. ఆశ్రమం బయటకు వచ్చి కార్లు ఎక్కబోతూ "అమ్మా!వారు కనీసం నిన్ను లోపలికి రమ్మనమనలేదు. కూర్చోమని కూడా అనలేదు. ఎందుకు ఇలా జరిగింది" అని అడిగాను.

"నాన్నా! వారిది పీఠం. పీఠ నియమాలు కొన్ని ఉంటాయి. ఆయన వాటిని దాటకూడదు. ముఖ్యంగా స్వామివారు ఆడవారితో అర్ధరాత్రి ఉండకూడదు కదా! అని చెప్పి స్వామివారి గురించి మాట్లాడుతూ, చాలా ఆనందంగా, ఎంతో ప్రేమతో "వాడు వేద పురుషుడు నాన్నా!" అని నాతో అంటూ కారు ఎక్కింది.

అమ్మ కారు, మా బృందం బస్సు మద్రాసు నగరానికి బయలుదేరాయి.

జయహోమతా!!!

భవదీయులు,
రాచర్ల లక్ష్మీనారాయణ

శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యన్నారాయణ శాస్త్రి,
F.F.8 Manasa Parkview,
8-24-6, Subba Rao St,
Gandhinagar,
KAKINADA - 533 004

శ్రీ బులుసు శ్రీరామ వేంకట సత్యనారాయణశర్మ
Retd Chief Accounts Officer,
Telecom Department,
C1, Aiswarya Enclave,
Kamaladevi Street, Gandhinagar
KAKINADA - 533 004
Ph No.0884-2372567

కాకినాడ
ది 3-7-2007

శ్రీ

పదార్చన

చి. శాస్త్రి "పదార్చన" పదములతో అర్చన. పదములకు అర్చన. ఏ పదము అది విష్ణుపదము. విష్ణుపదమే ఎందుకు? విష్ణువే విశ్వము కనుక. విశ్వమునకు భిన్నముగా ఏ పదమూ ఉండదు. విశ్వం విష్ణుః।

బ్రహ్మపదము కూడా ఆ పదములోనిదే. మరి "అమ్మ" ప్రస్తావన ఏమిటికి? "అమ్మ" 'విశ్వమాత', "విష్ణు రూపిణి", "విశ్వభ్రమణకారిణి", "విష్ణు మాయా విలాసిని". అమ్మలేని సృష్టీ లేదు, విశ్వమూ లేదు.

ఏ పద అర్చన అయిననూ ఆ "అవ్యయు" పదమునకే. విష్ణుపదార్చన, విశ్వపదార్చన. విశ్వపదార్చన విశ్వమాత పదార్చన. అది "అమ్మ" పదార్చన.

ఇట్టి విష్ణు పదార్చన, విష్ణుపద సంక్రమణ మందు వెలువడుట ముదావహము. చి॥ శాస్త్రికి నాఆశీర్వచనములు.

బులుసు శ్రీరామ వేంకటసత్యనారాయణ శర్మ

"స్వర భారతి" "సంగీత సరస్వతి" కాకినాడ
పెద్దాడ సూర్యకుమారి, ఎం.ఎ. (ఎ.ఐ.ఆర్. ఆర్టిస్ట్) ది 1-11-2007
సద్గురు సంగీత విద్యాలయం
8-11-17/2, గాంధీనగర్, కాకినాడ

శ్రీ పదార్చన

బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రిగారు వ్రాసిన "పదార్చన" రెండవ భాగమునకు నా అభిప్రాయం వ్రాయమని కోరారు. శాస్త్రిగారు తనకు ఎక్కడ తాను ఉన్నా అమ్మ కనిపించినట్లుగాను, ఆ భావన తనకు పాటల రూపంగా వచ్చిందని చెప్పారు. గణేశస్తుతి హంసధ్వని రాగంలో సర్వారంభములకు ముందు హేరంబుని కొలిచిన అనే కృతిలో రెండవ అక్షరము ప్రాస చక్కగా కుదిరినది. శాస్త్రిగారికి ఆశువుగా వచ్చిన కృతి ఇది. భగవంతుని ధ్యాసలో ఉండే వారికి చక్కని పదములు తమకు కూడ తెలియకుండా వస్తాయి. త్యాగరాజ స్వామి ఆశువుగా కొన్ని వేల కృతులు రామ ధ్యానములోనే ఉండి పాడినారు.

శాస్త్రిగారు రాసిన కృతులలో 'ఎట్టి యోచనలు చేసేవురా' ఆనందభైరవి రాగంలోను, 'నా వల్ల గుణదోషమేమి' అనే కృతి కాపీ రాగంలోను, అక్షరమునకు ఆది అమ్మ - అక్షయంబైనదే అమ్మ" అనే కృతి, అమ్మా నీ నామమే పావనమ్ అనే కృతి చాలా బాగా రాశారు. నేను "జిల్లేళ్ళమూడి అమ్మను చూడలేదు. కాని శాస్త్రి గారి రచనలు చదివి అమ్మను ఊహించుకుని నమస్కారము చేశాను.

శ్రీశాస్త్రిగారి రచనలన్నీ అమ్మ కృపచేత తొందరలోనే ముద్రించబడాలని వారి మనోభీష్టము అమ్మ తప్పక అనుగ్రహిస్తారని విశ్వసిస్తున్నాను. అమ్మ ఆశీస్సులు లేకపోతే ఏమీ చేయలేము. వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య, ఐశ్వర్య, సకల భాగ్యములను చేకూర్చవలసినదిగా అమ్మను ప్రార్థిస్తున్నాను.

పెద్దాడ సూర్యకుమారి
సంగీత విద్వాంసురాలు, కాకినాడ

"సాహిత్య కళానిధి"
విశ్వనాథం సత్యనారాయణ మూర్తి
డోర్.నెం. 7-71 పోస్టాఫీసు ప్రక్కన
ఇంద్రపాలెం, కాకినాడ - 533 006
ఫోన్ : 0884 - 2379678

కాకినాడ
22-7-2009

"అమ్మ బిడ్డ"

అమ్మ ఆప్యాయతలో అమృతాన్ని ఆస్వాదించి బ్రతుకును పండించుకొన్న ధన్యజీవి...... శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి.

శాస్త్రిగారి కన్నులకు "అమ్మ" అవతారమూర్తి!

నా దృష్టిలో: పేగు త్రెంచుకు పుట్టిన కన్నబిడ్డలను సైతం లంకె బిందెల మీది వ్యామోహంతో క్షుద్రశక్తులకు బలియిచ్చే కసాయి తల్లిదండ్రులున్న ఈ కలిలో యత్కించిత్ స్వార్థాన్ని బలిపెట్టి లోకం కోసం పాటుపడే వారెవరైనా అవతార పురుషులే!

లోకంలో ఏ అమ్మైనా తన బిడ్డలను లాలించి అన్నం పెడుతుంది. తన దర్శనానికి వచ్చిన ప్రతి ఒక్కరిని బుజ్జగించి, ప్రేమతో "నాన్నా! అన్నం తిన్నావా"! అని అడిగే ఆ స్త్రీమూర్తిని ఏమనాలి? జగజ్జనని, లోకమాత, అనొద్దూ? అందుకే జిల్లెల్లమూడి అమ్మ "మాతృశ్రీ" ఐంది.

నా గురుదేవులు "విద్వత్కవి" "కళాప్రపూర్ణ" బ్ర॥శ్రీ॥ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు నాకనేక సారస్వత విశేషాలను, ముచ్చట్లను, ఆఖ్యాయికలను చెపుతూండేవారు. ఒకసారి నిరతాన్నదాత్రి డొక్కా సీతమ్మగారిని గూర్చి చెపుతూ ఆయనిలా అన్నారు: "సత్యనారాయణా! నా దృష్టిలో అలనాటి సీతమ్మతల్లే ఈ సీతమ్మతల్లి! పెళ్ళయ్యాక ఆ సీతమ్మతల్లి (జానకి) పుట్టింటికి వెళ్ళలేదు! ఈ సీతమ్మతల్లి (డొక్కా సీతమ్మగారు) కూడా పెళ్ళయ్యాక తిరిగి పుట్టింటి గడప తొక్కలేదు! ఎందుకంటె తన నిరతాన్నదాన వ్రతానికి భంగం కలుగుతుందని"! చూశారా! అవతార తత్త్వాన్ని గ్రహించటంలో మా గురువుగారైన బ్ర॥శ్రీ॥ వెంపరాల వారిది ఎంత సువిశితమైన పరిశీలనా దృక్పథమో!

డొక్కా సీతమ్మగారిని గూర్చి ఇంకొక్క మాట! అలాటి మహాతల్లిని గురించి

ఇక్కడ కాకపోతే మరెక్కడ స్మరించుకోగలం? ఒకసారి మహాపండితులు బ్ర॥శ్రీ॥ వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అమలాపురం వచ్చి వెంపరాల వారితో "శాస్త్రీ! మనం ఒక్కసారి గన్నవరం వెళ్ళి డొక్కా సీతమ్మగారి ఇంటిని దర్శించుకొని రావాలోయి"! అన్నారట. సరే! ఇద్దరూ వెళ్ళారు. సీతమ్మ తల్లి నడయాడిన ప్రదేశాలన్నిటిని పేరుపేరున అడిగి తెలుసుకొని ఆ పుణ్యస్థలా లన్నిటిని కళ్ళకద్దుకొని, ఆవిడ నిత్యమూ పూజించే తులసికోటకు ప్రదక్షిణ నమస్కారం చేసి చిటికెడు మట్టి శిరసున ధరించి మరికాస్త నోట్లో వేసికొని **<u>తిరిగి అమలాపురం వచ్చి భోజనం చేశారట!</u>** ఆవిడ నిరతాన్నదాన వ్రతం ఆవిడతోటే అన్నపూర్ణ లోకాన్ని చేరుకొంది.

డొక్కా సీతమ్మగారిని గురించిన మరొక్క ముచ్చట. ఒకసారి సర్వశాస్త్ర పారంగతులు, వేదవేత్త, మహామంత్రశాస్త్రవేత్త, తపస్స్వాధ్యాయ సంపన్నులు, శాపానుగ్రహదక్షులు, సాక్షాత్తు పరదేవతాస్వరూపులు ఐన కఱ్ఱా అగ్నిహోత్రావధానులు గారు గన్నవరం వెళ్ళారు. డొక్కా సీతమ్మగారి దర్శనానికి. అగ్నిహోత్రావధానులు గారిని నేను బాగా ఎరుగుదును. ఆయనను గురించి చెపితే చాలా చెప్పాలి. సాక్షాత్తు ఆయన అగ్నిహోత్రుడే! తిరస్కృత బ్రహ్మపురందరుడు! ఆయన ముందు కూర్చునే ధైర్యం మైసూరు మహారాజుతో కలిపి మానవుమాత్రుడెవరికీ లేదు! సరే! సీతమ్మ గారిని దర్శించారు. కొద్దిసేపు కళ్ళు మూసుకొన్నారు. అంతర్దృష్టితో పరికించారు. "సీతమ్మా! నువు కాస్సేపు అలా నిల్చో"! అన్నారు. ఆతల్లికి ముమ్మారు ప్రదక్షిణం చేసి సీతమ్మతల్లి పాదాలను కళ్ళకద్దుకొన్నారు. అప్పుడు సీతమ్మతల్లి అందిగదా...... "ఒరే! ఒరే! అగ్గన్నా! ఎంత పని చేశావురా! ఇంత చదువుకొన్నావు! నేను వెధవముండని! (అప్పటికి సీతమ్మగారి భర్త జోగన్నగారు స్వర్గస్థులయ్యారు.) వెధవముండ కాళ్ళకు నమస్కారం చెయ్యవచ్చా?" అంది. అప్పుడు అగ్గన్న శాస్త్రిగారన్నారు కదా "నాకు తెలుసు సీతమ్మా నువ్వెవరివో! నాదగ్గరెందుకు దాస్తావు? నువ్వు సాక్షాత్తు కాశీ అన్నపూర్ణవు కదూ!" అంటూ మరోమారు నమస్కరించారు.

సరే! ఇంతకీ పై విషయాలను నేనెందుకు ప్రస్తావించానంటే..... నా దృష్టిలో అలనాటి జనకనందినియే డొక్కా సీతమ్మ గారైతే..... డొక్కా సీతమ్మగారి అవతారమే జిల్లెళ్ళమూడి అమ్మ.

అక్కడ ఇప్పటికీ నిరంతర అన్నదానవ్రతం నడుస్తోంది. అవతల వారి ఔన్నత్యాన్ని గుర్తించాలంటె ఇవతలి వారిలో కూడా కొంత సంస్కారం ఉండాలి. సంగీతాభిరుచి

లేని మొద్దుకు బిస్మిల్లాఖాను షెహనాయి కచేరి కూడా చంటిపిల్లాడి ఏడుపులా విసుగనిపిస్తుంది.

ఇంతకీ..... బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రిగారు అమ్మ దయామృతవృష్టిలో తడిసిముద్దైన ధన్యజీవి! అమ్మ అమృత హస్తంతో తినిపించిన అన్నంతో బ్రతుకును పండించుకొన్న పంటకాపు. అంటుకొన్న కల్మషాన్ని కడిగి పారేసుకొన్న కల్మాషపాదుడు. అమ్మ పలుకుల ఇండుప గంధంతో మనోమాలిన్యాన్ని కడిగేసుకొన్న అనసూయానిష్ఠుడు. అమ్మ వాత్సల్యంతో పులకించిన కుమారుడు. నేను శ్రీ బులుసు శాస్త్రి గారిని చాలా సన్నిహితంగా పరిశీలించాను. అమ్మ పేరు చెపితే ఆయన శరీరం పులకరిస్తుంది. ఏదో తెలియని ఉన్మాదావస్థలోకి వెళ్ళిపోతారు. నామనసులో మాట.... నేను చూచిన దృశ్యం.

అమ్మ తన జీవితంలో 1936 నుండి 1956 మధ్యకాలంలో చాలా కష్టాలు పడ్డారట. శ్రీ శాస్త్రిగారు ఆమె అనుభవించిన కష్టాలను, కడగండ్లను నాతో కొన్ని చెప్పి కన్నీరు పెట్టుకొన్నారు. నాకెందుకో అలనాడు ఆడపులుగుకు జరిగిన అపరాధానికి కన్నీరు పెట్టుకొన్న మహర్షి వాల్మీకి స్ఫురించాడు. అందుకే అమ్మ స్ఫురణ వచ్చినప్పుడల్లా ఆయన శిశువే (కుమారస్వామి).

శ్రీ శాస్త్రిగారు చేసింది హూణవిద్యాభ్యాసమే ఐనా ఆంతర సంస్కారం మాత్రం వైదికమే. తూర్పు గోదావరి జిల్లాలో బులుసు వారిది పండిత వంశం. "పులుసు లేని పెళ్ళి - బులుసు లేని యజ్ఞం లేదు" అని సామెత. బులుసు పాపయ్య శాస్త్రిగారు, అప్పన్న శాస్త్రిగారు జగద్విఖ్యాతులైన పండితులు. వారి నిరంకుశ పాండిత్యానికి ఆంధ్రదేశంలో ఒక సామెత పుట్టింది. సర్వజ్ఞుడైన మహాదేవుని వాహనమైన, జ్ఞాన స్వరూపుడైన నందీశ్వరునకు రెండు కొమ్ములైతే "బులుసు" వారింటి పేరులో మూడు కొమ్ములు. అలాటి పండిత వంశంలో పుట్టిన శ్రీ శాస్త్రి గారికి వైదిక సంస్కారం అబ్బటంలో వింతేమీ లేదు. ముఖ్యంగా శంకరులన్నా, వారి అద్వైత దర్శనమన్నా శ్రీ శాస్త్రిగారికి పరమభక్తి. గతంలో వీరు కొన్ని రచనలు చేశారు. "సంస్కృతాంధ్రాలను నేను చదువుకోలేదు" అని తరచుగా శ్రీ శాస్త్రిగారనే మాట. కావచ్చు. కాని చాలామంది సంస్కృతాంధ్రాధ్యాపకుల కంటె వారికున్న భాషాజ్ఞానం మెఱుగైనది.

చిరకాలంగా వారితో నాకున్న పరిచయంతో వారిని గూర్చి నాఅభిప్రాయం.

గుణం ఉంటే మెచ్చుకొంటారు. నిర్మత్సరులు వారు. సాధారణంగా కొందరు అసూయచేతను, మాత్సర్యం చేతను, ఈర్ష్య చేతను వారి ముందు ఎంత మంచి కవిత్వాన్ని వినిపించినా బాగుంది" అని అంటే అవతలవాడెక్కడ ఎదిగిపోతాడో అని మొద్దులా ఉండిపోయిన వాళ్ళను నేనెరుగుదును. ఇలాటి వాళ్ళను గురించే భర్తృహరి బాధపడ్డాడు.

శ్రీ బులుసు శాస్త్రిగారి నిజాయితీ అనండి, అంతరంగ స్వచ్ఛత అనండి, ధైర్యం అనండి ఏమంటారో మీ ఇష్టం.... ఆయన ఈ గ్రంథాన్ని నాకిచ్చి ఇందులో తప్పులుంటే దిద్దండి గుణదోష విమర్శ చేయండి - నచ్చితే నచ్చిందని వ్రాయండి నచ్చకపోతే ఇంతకంటె చెత్త పుస్తకం మరొకటి లేదని వ్రాయండి - మీరేమి వ్రాసినా అక్షరం తీసెయ్యకుండా నే అచ్చువేసుకొంటాను అన్నారు. ఈ మాటనటానికి ఎంతధైర్యముండాలి? ఇంత వరకు వచ్చాను కనుక గ్రంథాన్ని గూర్చి కొద్దిగా ప్రస్తావిస్తాను. శాస్త్రిగారు తాను చెప్పుకోనవసినదంతా "మనవి" మాటల్లో చెప్పుకొన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొనే ఎవరైనా విమర్శించాలి. "నేను అంతటి వాణ్ణి! ఇంతటి వాణ్ణి!" - అని ఆయన అనలేదు.

ఎఱ్ఱాప్రెగడ గారంత వినయంగా వ్రాసికొన్నారు. ఎఱ్ఱాప్రెగడ శంభుదాసుడు - శాస్త్రిగారు అమ్మదాసుడు. నేనుకూడా అమ్మను దర్శించాను.... కాని శాస్త్రిగారిలా కాలేకపోయాను.

పాటలు వచ్చిన నేపథ్యాన్ని శాస్త్రిగారు చెప్పారు. అమ్మ భక్త సంఘంలో ఈ పాటలు బాగా ప్రచారంలోకి వస్తాయి...షిర్డిసాయి, సత్యసాయి పాటలవలె. "తనదైన అనుభూతి తనది గాన" - అని కవిసమ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ గారన్నట్లు... అమ్మపట్ల తన భక్తిని శాస్త్రిగారిలా ప్రకటించుకొన్నారు. యతి-ప్రాసలు, వ్యాకరణం తదితర నియమాలు గేయ వాఙ్మయానికి కూడా ఉన్నాయి గాని కావ్యాలలో వలె అంత కఠినం కావు. ఇక్కడ భక్తి ప్రధానం. కనుక వాటికి మనం మినహాయింపు ఇవ్వాలి. కావ్యాలు పండితులైన వారు చదువుకోవలసినవి. పాటలు పండిత పామరులందరూ పాడుకోవచ్చు. ఆకారణంగా పాటలు పామరుల నోళ్ళలో పడి భ్రష్టరూపాన్ని పొందేఅవకాశం ఉంది. కొందరు సాతానుల నోళ్ళలోపడ్డ రామదాసుగారి కీర్తనలు ఎలాటి భ్రష్టరూపాన్ని పొందాయో మనం ఎరుగుదుం. భ్రష్టత్వానికి చిన్న ఉదాహరణ: "ఈణా ఇనోదరమ్మ ఆణి పంపరయేణి" - ఇది నా చిన్ననాడు విన్న ఒక పాటయొక్క

పల్లవి. ఎంత బుఱ్ఱ బ్రద్దలు కొట్టుకొన్నా దానర్థం నాకు తెలియలేదు. కొంచెం నే పెద్దనై సాహితీ పరిచయం కలిగాక ఆ చిక్కుముడి విడింది. దాని అసలు స్వరూపం ఇది: "వీణా వినోదరమ్య వాణి బంభరవేణి." ఇది సరస్వతీస్తుతి.

శాస్త్రిగారి గేయాలలో "నిన్ను ఎవరని కొలుతు...." అనే గేయంలో తిక్కన గారి హరిహరాద్వైతం ఉంది. అలాగే "అంతపెద్దరూపుకల సుందర విశ్వమా ఇంత చిన్న బొందెలోన - ఇమిడిన తేజమా!'' - అని అనటంలో ''అణోరణీయాన్ మహతోమహీయాన్" అనే ఉపనిషద్భావన ఉంది. "మాట పుట్టే చోటు కనరయ్యా....." అనే గేయంలో పర - పశ్యంతి - మధ్యమ- వైఖరి వాక్కుల ప్రస్తావన ఉంది. "విశ్వమందు ఎక్కడనో మేదినిపై మనుగడ ఇది" - అని అనటంలో మన భూమి మన పాలపుంతలో ఒక మూలను ఇసుక రేణువు కంటె చిన్నగా నక్కి ఉంది అనే ఖగోళ విజ్ఞానపు విషయం దాగి ఉంది. ఈ విధంగా శాస్త్రి గారి భక్తి, జ్ఞాన, వేదాంత, వైరాగ్య, తాత్త్వికభావాలు ఈ గేయాలలో మనకు స్ఫుటంగా దర్శనమిస్తున్నాయి.

ఇంకొక్క విషయాన్ని సహృదయమైన పాఠకులకు మని చేస్తాను సహృదయులు అని ఎందుకన్నానంటె.... ఈ సహృదయుల మీద ఆధారపడేది కవిత్వమేకాని శాస్త్రం కాదు. శాస్త్రం వారి వారి పాండిత్యం మీద ఆధారపడి ఉంటుంది. కవిత్వం రసవంతమాకాదా అనే విషయం సహృదయాధీనం మచ్చుకు ఒక పద్యం చూపిస్తాను.

"కం" ఈ లోకకమయగు కొందఱు
కాలోకమ కొందఱకు నిహంబున్ పరమున్
మేలగు కొందఱ కధిపా!
యేలోకము లేదుసూవె యిల కొందఱకున్

ఈ పద్యం కవిత్రయం లోని వాడైన యెఱ్ఱాప్రగ్గడ గారిది. భౌతిక వాదులైన చార్వాకులకు భూలోకం - ఆస్తికులైన వారికి ఆ లోకం అంటే స్వర్గం - ఇక నాస్తికులైన వారికి ఏ లోకమూ లేదని ఈ పద్యం యొక్క తాత్పర్యం. ఈ పద్యం చదువుకొన్నప్పుడట్లా ఒళ్ళు పులకరిస్తుందని తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు * మెచ్చుకొన్నారు. ఈ పద్యంలో ఏముంది ఒళ్ళు పులకరించడానికి ? అంకారమా? శయ్యా సౌభాగ్యమా? ధ్వనియా? ఇంకా...ఇంకా... అంటే ఏమీ లేదు! మరెందుకా పులకరింత అంటే .... అదే సహృదయత.

శ్రీ బుసులు శాస్త్రిగారు యెఱ్ఱాప్రగ్గడ గారి పద్యమే చదివి వ్రాశారో లేక మరే ఆధారంతో వ్రాశారో గాని "అమ్మా" అనే మకుటంతో ఉన్న 19వ కీర్తనలో

"ఏ లోకంబులు ఏ జీవులకని
విడివిడి పంచుట నీవే
ఆ లోకంబులు ఆ జీవులకని
వడివడి త్రిప్పుట నీవే ! అమ్మా!

అని వ్రాసారు. నిజయంగా సహృదయులకీ భావం పులకరింత! శాస్త్రి గారికి కలవరింత! ఆ లోకం అంటే స్వర్గం. అది కర్మిష్టులకు. పుణ్యం క్షీణించగానే మళ్ళీ పునర్జన్మ. దీనినే శాస్త్రిగారు వడి వడి త్రిప్పుట అంటున్నారు. మరి ఈ త్రిప్పటలు తప్పేదెలా అంటే ఆత్యంతిక దుఃఖ నివృత్తి రూపమైన శంకరాద్వైతాన్ని ఆశ్రయించండి అని శాస్త్రి గారి తలపుచింత!

గది తలుపులు, కిటికీలు తెరవకపోతే కొత్తగాలి ఎలారాదో అలాగే మనసు తలుపులు తెరవకపోతే సాహిత్య పరిమళం అంటదు.

ఈ గ్రంథం శాస్త్రిగారి "వైఖరీ" వాక్కు. దాని వెనకనున్న పరావాక్కును అందుకో గలిగితే శాస్త్రిగారు అర్థమవుతారు.

"శుభం"

22-7-2009
కాకినాడ - 6

విశ్వనాధం సత్యనారాయణ మూర్తి.

* "చులిక" అనే శీర్షిక క్రింద ఆనాటి భారతి అక్టోబర్ 1945 మాస పత్రికలో చెల్ల పిళ్ళ వెంకట శాస్త్రిగారి వ్యాసం ఆధారంగా

పదార్చన
ద్వితీయ భాగం
1. గణేశ స్తుతి

హంసధ్వనిరాగం - ఆదితాళం

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల,
సర్వశుభముల గాంతురు ॥సర్వారంభము॥

సిద్ధిబుద్ధి ప్రదాతను,
సిద్ధ సంఘ సంపూజ్యుని,
విఘ్నహరుని మదిని, ని
ర్విఘ్నతకై కైమోడ్చిన ॥సర్వారంభము॥

అలనాడు పాల్కడలి తరచువేళ,
తొలిపూజ పొందు ఈ వేల్పుల పెద్దకు
సురాసురులు మ్రొక్కులిడగ
అమృతసిద్ధి లక్ష్మీ ప్రసన్నత కలిగెకదా! ॥సర్వారంభము॥

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల,
సర్వశుభముల గాంతురు.
గం గణేశాయ నమః

2. ఎట్టి యోచనలు చేసేవురా

రాగం : ఆనంద భైరవి - ఆదితాళం

ఎట్టి యోచనలు చేసేవురా! నీ
కెదురుపల్కువా రెవరూ లేరనా! ॥ఎట్టి॥

(1) చరణం : గట్టిగా కన్పట్టు సృష్టికార్యమంతా,
ఒట్టి ఓటికుండా? అంతా బూటకమా? ॥ఎట్టి॥

2వ చరణం : వేదజాలమంతా వీథులంతాపరచి
వాదమేలేని వివాదరహిత, నీవు, ॥ఎట్టి॥

3వ చరణం : స్రష్టకైనగాని తెలియరాని, నీ
తత్త్వమెరుగజేసి, మాచింత తీర్చరా, ॥ఎట్టి॥

ఎట్టి యోచనలు చేసేవురా! నీ
కెదురుపల్కు వారెవరూ లేరనా!

3. నిన్నూ, ఎవరని కొలుతు!

రాగం : పంతువరాళి - ఆదితాళం

నిన్నూ, యెవరని కొలుతు! నిఖిలలోకాధారా!
పన్నగశాయివా? ఉరగభూషణుడనా! ॥నిన్నూ॥

(1) చరణం : ఉరమున యువిదను చేకొన్న స్వామివా?
తనువున తన్వికి సగపాలు ఇచ్చావనా! ॥నిన్నూ॥

2వ చరణం : మన్ను మిన్నూ మీది తత్త్వ స్వరూపమా!

ఓం బ్రహ్మవిదా ప్నోతిపరమ్! తాదేషా ऽభ్యుక్తా! సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ! యోవేదనిహితం గుహాయాం పరమేవ్యోమన్! సో ऽశ్నుతే సర్వాన్కా మాన్సహ! బ్రహ్మణా విపశ్చితేతి! తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః ।అద్భ్యః పృథివీ! పృథివ్యా మోషధయః। ఓషదీభ్యో ऽన్నమ్॥ అన్నాత్పురుషః। సవా ఏష పురుషో ऽన్నరస మయః।

అన్నిట నిండిన చైతన్య తేజమా! ॥నిన్నూ॥

3వ చరణం : నీరూపమైన బహురూపమా! నీవు,
సారూపతేలేని అద్వయ స్వరూపమా! ॥నిన్నూ॥

4వ చరణం : నామ రూపమే లేని సర్వనామమా నీవు॥
త్రయీ సాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదం పత్యమితచ।
రుచీనాం వైచిత్ర్యాదృజుకుటిల నానాపథఝాషాం
నృణామేకోగమ్యః త్వమసి పయసార్ణవమివ॥

పామరుడనైన, నే, నిన్ను ఎవరనీ కొలుతు ॥నిన్నూ॥
నిన్నూ ఎవరని కొలుతు! నిఖిలలోకాధారా!
పన్నగశాయివా? ఉరగభూషణుడనా?

4. నిన్ను, కొలువ తరమా!

దేశ్ రాగం - ఆదితాళం

నిన్ను కొలువ తరమా! నీరజనయనా!
ఎన్నగ ఈ మహిత విశ్వము నందున! ॥నిన్ను॥

(1) చరణం : ఎంతని దేశము, అందు ఎంతని కాలము,
అంతమే లేనట్టి ఈ చందమేమిటని; ॥నిన్ను॥

2వ చరణం : వేయితలల వాడా! వేయికన్నులతేడా!
వేయి పాదాల తోడ! విశ్వమంతట నిండిన; ॥నిన్ను॥

3వ చరణం : అంతపెద్దరూపుకల సుందర విశ్వమా!
ఇంత చిన్న బొందెలోన, ఇమిడిన తేజమా! ॥నిన్ను॥

నిన్ను కొలువ తరమా! నీరజనయనా!
ఎన్నగ ఈ మహిత విశ్వము నందున!

(5) మాటపుట్టే చోటు కనరయ్యా!

మాటపుట్టే చోటు కనరయ్యా! ఈ
మట్టికొంపను,
మాటవచ్చే చోట వినరయ్యా! ఈ
మట్టి కొంపను

(1) చరణం : ఊదు బుడగ ఉబ్బియున్నది,
కాదు దీని అసలు మర్మము,
చేదు మింగిన చేవరాయుని,
మీది బట్టిన వివరము; ॥మాటపుట్టే॥

2వ చరణం : కులుకు లొలికే పలుకు బోడి
పరమ యోగుల చూపు, మధ్య
భావ రూపము బట్టకట్టెను
చింకి బొంతా, పట్టుబట్టో; ॥మాటపుట్టే॥

3వ చరణం : బయలు వెడలిన పలుకులెల్ల,
బయలు కలిసెను రూపులేక,
ఈ వైఖరేమని ఎఱుగరైరి
హోయలు తెలియని అంధులైరి ॥మాటపుట్టే॥

4వ చరణం : మాడుతట్టి ఉబికి వచ్చే
మాట ఒక్కటే యున్నది,
మూడు లోపల మునిగియున్న
మాట పుటకే మర్మము;
మాటపుట్టే చోటు కనరయ్యా! ఈ
మట్టి కొంపను,
మాటవచ్చే చోట వినరయ్యా! ఈ
మట్టి కొంపను,

చత్వారీవాక్ పరిమితా పదాని తాని,
విదుర్బ్రహ్మణా యే మనీషణః।
గుహాత్రిణి నిహితా నేంగయంతి
తురీయం వాక్ మనుష్యావదంతి॥

(ఋగ్వేద 1-164 -45)

(6) కాచువాడు!

రాగం చక్రవాకం - ఖండచాపు తాళం

పల్లవి : కాచువాడ వనుచునే దోసిలొగ్గి యున్నవాడ,
కాచ వాచ మనములన్నీ, నీ రచనలులే హరా! త్రినేత్ర;
॥కాచువాడ॥

1వ చరణం : వాచామగోచర! వామదేవ! నీవేకానకున్న ఎవరు దిక్కు
వీచుగాలికి మేఘమల్లే రూపుచెడి తిరుగు మాకు;
॥కాచువాడ॥

2వ చరణం : విశ్వమందు ఎక్కడనో మేదినిపై మనుగడ ఇది,
విశ్వనాథ! ఆదిదేవ! అష్టమూర్తీ! కష్టపెట్టకయ్య మమ్ము;
॥కాచువాడ॥

కాచువాడ వనుచునే వేచి యున్నవాడ,
కాచ వాచ మనములన్నీ, నీ రచనలులే! హరా! త్రినేత్ర!

7.నావల్ల గుణ దోషమేమి?

రాగం కాపీ - ఆది తాళం

నావల్ల గుణదోష మేమి?
నీవల్లనే గాక, ! ఓ! చైతన్య ప్రదాతా!

చరణం : కామ ముఖ్యరిపు షట్కమును
మనమున పంద జేసి,
తామస రాజస గుణముల
చక్రనేమి చొక్కజేసియుండ, ॥నా వల్ల॥

చరణం : అటుపంపి, ఇటు పంపి, ఎటు వెడలినా కూడ
చేటు చేకూరునను జ్ఞానశూన్యముగాగ,
* సాటిలేని మేటి తత్త్వము దాచి,
వాటముగ నీ వాడు ఆటకద ఇది ఎల్ల, ॥నా వల్ల॥
నా వల్ల గుణ దోషమేమి?
నీ వల్లనే గాక, ఓ! చైతన్య ప్రదాతా!

---

* ఈ పదముల కూర్పుతో పరబ్రహ్మతత్వాన్ని అందించే ఒక అందమైన అభివ్యక్తి తెలుగుభాషలో కూర్చబడింది. "రమణీయార్థః ప్రతిపాదక శబ్దః కావ్యః" అన్నారు సంస్కృత అలంకారికులైన జగన్నాథ పండిత రాయలవారు. "సాటిలేని మేటి తత్త్వమే" జిల్లెళ్ళమూడి అమ్మ. దానిని అమ్మ ఎప్పుడో "అది" అని నిర్దేశించింది. దానిని "సదసదీతీత సుస్థితి - అది - నా నిజస్థితి" అని చెప్పుకున్నాను నా "అక్షరం వీథిన పడింది" గ్రంథంలో.

8 .వేడికోలు

రాగం శంకరా భరణం - తి(శచాపు తాళం

వేడికోలు చెప్పుకోరో
(అ) ఏడుకొండల సామికి,
వేడివేడి బ్రతుకుల
వాడిపోని కతలెల్ల ॥వేడికోలు॥

(1) ఆడ ఈడ తిరుగాడి
తేడు రెడ్డి సేవించి,
వీడిపోని బంధాల
కాడి ఎద్దులైనాము; ॥వేడికోలు॥

(2) తనువు తీపి తెగలేదు,
మనసు బెమ చావలేదు,
మనవి నెల్ల చేకొనే
మొనగాడే యతడు; ॥వేడికోలు॥

(3) (ఆ) మెట్లు ఆరు మేనునందు,
గట్టు పుట్ట తొక్కనేల,
చెట్టు చేమ తడవ నేల,
ఎట్లాగన్నా వానినెక్కి, ॥వేడికోలు॥

(4) మూలమందు లేవగానే
దివ్యప్రభ గోచరించు,
చాలు మనకు ఆ దారే
(ఇ) కొండల కోనేటి చేర; ॥వేడికోలు॥

(అ) షట్చక్రాలు, సహస్రారం
(ఆ) షట్చక్రాలు
(ఇ) మానస సరోవరం

9. పెద్ద బెమ చిన్న బెమ (తత్త్వం)

పెద్ద బెమ, చిన్న బెమ
బుల్లి బెమరా;
ఎంత బెమో, ఎంత బెమో,
అంత బెమరా; ॥పెద్ద బెమ॥

1 బెమ్మ మందు చుట్టి[1]యంతా
పెద్ద బెమరా,
బెమ్మ మొక్కటేననే
సత్తె మెరుగరా; ॥పెద్ద బెమ॥

2 తాడునందు పాము గన్న
చిన్న బెమరా,
లోన వింతలెల్లచూడ
బుల్లి బెమరా; ॥పెద్ద బెమ॥

3 బుల్లిదైనా, పెద్దదైనా
అంతా బెమేరా,
బెమపోతే బెమ్మమనే
పిచ్చి తల్లిరా,[2] ॥పెద్ద బెమ॥1

---

(1) సృష్టి
(2) కురుమద్దాలి పిచ్చెమ్మగారు

10. ఎదురొచ్చి

రాగం రేవతి - ఆదితాళం

ఎదురొచ్చి నను చేకొనవా!
ఎద రొదను గమనించవేమి?
వ్యధలు నిండిన బ్రతుకులే ఇవి,
విధి విలాసము లందు వేమి? ॥ఎదురొచ్చి॥

(1) అలసి సొలసిన బ్రతుకు
బడలికలు బరువాయె,
కలసియున్నాము కదా!
కడకు ఒకటే కదా; ॥ఎదురొచ్చి॥

(2) అడ్డదిడ్డముగా కదలి,
అడ్డదారులు తొక్క,
చెడ్డవాడని ఎంచ
విడ్డూరమేమి స్వామి; ॥ఎదురొచ్చి॥

(3) మైల పులుముకున్న
బాలుని గతినాది,
అమ్మ వలెనను కడిగి
అంటు తొలగింపవా! ॥ఎదురొచ్చి॥

ఎదురొచ్చి నను చేకొనవా!
ఎద రొదను గమనించవేమి?
వ్యధలు నిండిన బ్రతుకులే ఇవి,
విధి విలాసము లందు వేమి?

11. ఎంతరానీ!

రాగం శ్రీరంజనీ - రూపక తాళం

* ఎంత రానీ, ఎంతపోనీ!
చింత తీరుటే కలవు,
వింతయను ఈ సృష్టి చింతే
ఇంత తగవుకు కారణంబు; ॥ఎంతరానీ॥

చరణం(1) ఆదిలేని వాడవనుచు,
వాదులాడుకు తిరుగు మాకు,
నీదు రూపము, గుణము, కర్మ
ఏదనీ తెలియ నేరము; ॥ఎంతరానీ॥

చరణం(2) ప్రభవ, విభవ, ప్రళయ సంజ్ఞలు
సభలలో వివాద మాయెను,
ఉభయ వేదాంతముల మూఢులకు,
అభవ! నీ నిజవైభవంబే మెఱుక; ॥ఎంతరానీ॥
ఎంత రానీ, ఎంతపోనీ!
చింత తీరుటే కలవు,
వింతయను ఈ సృష్టి చింతే
ఇంత తగవుకు కారణంబు;

---

* ఎంత చదువు - సరస్వతి వరకూ
ఎంత ధనం - కుబేరుని వరకూ
ఎంత పదవి - బ్రహ్మ వరకూ

12. శ్రీ లక్ష్మీప్రసన్న రామాయణం

(ఒక తెల్లవారగట్ల రామ నామాన్ని గురించి ఆలోచిస్తుంటే నాకు అనిపించింది -- మనకు మన తల్లి తండ్రులే నామకరణం చేస్తారు. శ్రీరాములవారి నామకరణం కౌసల్యా దశరథులు చేయలేదు, వశిష్ఠుల వారు చేసారు. అలాగే శ్రీ కృష్ణులవారికి నామకరణం దేవకీ వసుదేవులు గాని, నందయశోదలు గాని చేయలేదు. గర్గాచార్యుల వారు చేసారు. రామ,కృష్ణ నామాలు మహామంత్రాలయ్యాయి. ఈ భావన మెదిలి నా చేత శ్రీ లక్ష్మీప్రసన్న రామాయణాన్ని పాడించింది.)

12. శ్రీ లక్ష్మీప్రసన్న రామాయణం

రాగమాలిక : రంజని, శ్రీరంజని, శివరంజని, మారరంజని, సుమనేశ రంజని

తాళం : మిశ్రచాపు

పల్లవి : ఏమి నామము ఏమినామము
ఏమి నామము రామనామము;

1. సవన మందున పాయసాన్నము,
కౌసల్య గర్భము నిండిపండిన; ॥ఏమినామము॥

2. కులగురువు వశిష్ఠులచే,
ఎన్నబడినదీ పావన నామము; ॥ఏమి నామము॥

3. సవన రక్షకు ఇలువెడలినా,
ఇల్లాలితో తిరిగొచ్చిన; ॥ఏమి నామము॥

4. శివుని వింటిని విరచినాడని
కుపితుడగు భృగురామునీ,
గర్వమణచి వానిసొత్తగు.
విష్ణుతేజము కొల్లగొట్టిన; ॥ఏమి నామము॥

5. తమ్ములగు భరతాదులందరకు,
పరమపావన ప్రేమధామము; ॥ఏమి నామము॥

6. తండ్రి దశరథు అవసానదశలో,
పలవరింతలు పులక లిచ్చిన; ॥ఏమి నామము॥

7. గంగ దాటేవేళ గుహునకు,

పాదసేవా భాగ్యమిచ్చిన; ॥ఏమి నామము॥

8. తిరిగి రమ్మనికోరి విలపించు,

భరతునకు పాదుకలనిచ్చిన; ॥ఏమి నామము॥

9. కారడవిలో మునులందరకు,

రూపుదాల్చిన ప్రణవ మంత్రము; ॥ఏమి నామము॥

10. కాననము నందు సాధుసంతుకు,

అభయమిచ్చిన దివ్యతేజము; ॥ఏమి నామము॥

11. యుద్ధకాండకు దారితీసిన

చుప్పనాతిని కురూపి చేసిన; ॥ఏమి నామము॥

12. పదియు నాలుగు వేల రక్కసుల,

ఒక్కాడే దునుమాడిన; ॥ఏమి నామము॥

13. రాక్షసేంద్రుడు మాయపన్ని భూమిసుత గైకొన్నతరి,

చెట్టుపుట్టా, గుట్ట దిబ్బా తిరిగి తిరిగి అలసి సొలసిన; ॥ఏమి నామము॥

14. ముసలి శబరి కొరికి పెట్టిన,

ఫలములన్నీ విందారగించిన; ॥ఏమి నామము॥

15. కపివర్యుచే వేదవిజ్ఞాపనము బడసి,

బంటురీతి కొలువునిచ్చిన; ॥ఏమి నామము॥

16. అశోకవని జానకమ్మకు;

ధైర్యమొసగిన దివ్యనామము, ॥ఏమి నామము॥

17. కోతి మూకలు చేరికట్టిన,

సేతువుకు బలమైన పట్టగు; ॥ఏమి నామము॥

18. శరణువేడిన పగతు తమ్ముకు
అభయమిచ్చిన వీర తేజము; ॥ఏమి నామము॥

19. దశకంఠు తలలన్ని తరిగి,
వెలుగునింపిన ఆత్మతేజము; ॥ఏమి నామము॥

20. 'పరుని పంచన భూభ్రమణ పరిమితి,
గడపినందున కిచ్చగించను' అను, ॥ఏమి నామము॥

21. అన, చితినెక్క తల్లి జానకి గరిమ,
ఏరేడు లోకాల వినుతింపచేసిన; ॥ఏమి నామము॥

22. పుష్పకంబున అయోధ్య చేరి,
ఆనందలహరగు పట్టాభి రామము; ॥ఏమి నామము॥

23. నిండుగా పరమేశుడీశుని,
దండిగా ఎదనిండి యుండే; ॥ఏమి నామము॥

24. పవన సూనుని డెందమున,
కొలువుండియుండే సీతారామము! ॥ఏమి నామము॥

ఏమినామము ఏమినామము
ఏమినామము రామనామము;

ఇతి శ్రీలక్ష్మీప్రసన్న రామాయణం సంపూర్ణం
సర్వేజనాః సుఖినోభవంతు.

13. ఒక జావళీ
రాగమాలిక

రాగం - ఖమాస్ - తిశ్రచాపు తాళం

నిజముగా ఏమున్నదని,
ఇంత మోహ మేలరా!
అజునికైనా తప్పరాని,
భామ చింతమానరా; ॥నిజముగా॥

(1) కూతువరస కూడదన్నా
కొంగు వదల లేదురా,
నీతులెన్నో చెప్పినా మరి
మాట వినలేదురా; ॥నిజముగా॥

(2) చిత్తమందలి భ్రాంతితోనే
పొందు కోరివచ్చెరా,
వలదు, వలదని ఎంత చెప్పినా
తప్పు చేసి వదలెరా; ॥నిజముగా॥

(3) భవుని చేతి దెబ్బతిన్నా
బుద్ధిరాకపోయెరా,
యువిదలన్నా చిన్నచూపు
మానకున్నా ముప్పురా; ॥నిజముగా॥

(4) ఈసృష్టియంతా బ్రహ్మ తప్పే
నీకు నాకు ముప్పురా,
వాసవాదులు చేసే తప్పులు
మనను తిప్పలు పెట్టురా; ॥నిజముగా॥

(5) గోకులములో నందగోపుని
ముద్దుపట్టి చేసెగా,
వ్యాకులము చెందక, నన్నుచేరి
ముద్దు తీర్చి వెళ్ళరా: ॥నిజముగా॥
నిజముగా ఏమున్నదని
ఇంత మోహమేలరా,
అజునికైనా తప్పరాని
భామచింత మానరా,
భామచింత మానరా,
భామచింత మానరా!

14. హరిహరపుత్రనే

(చిరంజీవి వడలి ఫణినారాయణ వర్ధమాన సంగీత ప్రయోక్త. అతను ఒకసారి "అయ్యప్ప స్వామి మీద కూడా ఏవైనా గేయాలు వ్రాయండి, పాడుకుంటాను" అని అడిగాడు. ఫణి నారాయణ మాల ధరించి శబరిమలై వెళ్ళాడు. "నాయనా! నేను ఇంతవరకు శబరిమల యాత్ర చేయలేదు. ఇకపైన చేయగలనో లేదో చెప్పలేను. నేను పాటలు వ్రాయను. అవినానుండి రావాలి, అంతే వస్తే అలాగే వ్రాస్తాను" అని చెప్పాను. ది.1022007న మరియు 12.2.2007 తేదీలలో రెండుపాటలు అప్రయత్నంగా వెలువడ్డాయి. అవి ఇవి....

తిల్లాంగ్ రాగం - ఆదితాళం

హరిహరపుత్రనే
అయ్యప్పనే,
సతతము కొలుతును
సంతోషముతో; ॥హరిహరపుత్రనే॥

1వచరణం కొండల రాయుని
కొలుచుటకై,
మండల దీక్షను
మదిచేకొందు; ॥హరిహరపుత్రనే॥

2వచరణం శివకేశవుల
చిట్టి తనయుని,
పడిపూజలతో
పలుమరు వేడుదు; ॥హరిహరపుత్రనే॥

3వచరణం మది నిలిపే క్రియలేక
వడివడి తలపులు
పరుగులు తీయ,
వేగమునాపి బ్రోవుమయా; ॥హరిహరపుత్రనే॥

4వచరణం గజాననునికి
షడాననునికీ,
దీటగు తమ్ముడ వీవయ్య
మామది హృదిని నిలువుమయా; ॥హరిహరపుత్రనే॥

5వచరణం పరమపూజ్యమగు
నీ పదములకు,
నా వేదనలే నివేదనలయా
స్థిరమగు శాంతి నీయవయా: ॥హరిహరపుత్రనే॥

హరిహరపుత్రనే
అయ్యప్పనే,
సతతము కొలుతును
సంతోషముతో;

15. అయ్యప్పా, అయ్యప్పా, అయ్యప్పా

కానడరాగం - చాపుతాళం

అయ్యప్పా, అయ్యప్పా, అయ్యప్పా అనినే
పిలచిన పలుకవదేమిరా, సామీ, ॥ ॥అయ్యప్పా॥

1వచరణం పలుకూ పలుకూ నడుమనుండెడి
పరమశాంతి స్వరూపా! దేవా; ॥అయ్యప్పా॥

2వచరణం అన్ని పలుకులు నాభికమలమున
ఉన్నవే కదా! ప్రీతి స్వరూపా! దేవా; ॥అయ్యప్పా॥

3వచరణం కొండల నెక్కగ లేనుకదా! నా
అండనుండి బ్రోవగలేవా! దేవా!॥ ॥అయ్యప్పా॥

అయ్యప్పా, అయ్యప్పా, అయ్యప్పా, అని
నే పిలచిన పలుకవదేమిరా, ॥సామీ॥

అమ్మ అవతరణ

"అనంతత్త్వము దేశకాల పరిధులలోకి
రావడమే, అవతరణము" అని అమ్మ నుడివినట్లుగానూ,

శ్రీ రమణభగవానులు "పూర్ణో విభాతిస్వయం" అని నుడివినట్లుగానూ జిల్లెళ్ళమూడి అమ్మ అవతరణ జరిగింది.

అట్టి అఖండ జ్ఞాన స్వరూపాన్ని మిగిలిన
నవగేయ ఖండికలలో అర్చించుకుంటున్నాను.

"జయహో మాతా"

16. వెలుగులకు వెలుగు

రాగం సరస్వతి - మిశ్రచాపు తాళం

వెలుగు చూపు విశ్వజనని,
ఈవిశ్వమంతా వెలుగేయని; ॥వెలుగు చూపు॥

(1) అణువు వెలుగు, కృణువు వెలుగు.
జణువు వెలుగు, జగతి వెలుగు,
ఈవిశ్వమంతా వెల్లువయై
వెలుగే నిండి పొర్లినదని; ॥వెలుగుచూపు॥

(2) బుద్ధి వెలుగు, బిడ్డ వెలుగు,
పుడమి వెలుగు నభము వెలుగు,
నభోమణి వెలుగులతో
నిండిన జగమెల్ల వెలుగని, ॥వెలుగుచూపు॥

(3) కలలో కనిపించు వెలుగు,
ఇలలో వ్యాపించు వెలుగు,
సర్వమందు ఎల్లెడలా
"నేనే" వెలుగైయున్నానని; ॥వెలుగుచూపు॥

(4) వెలుగుకు వెలుగైన తల్లి,
జగతికి వెలుగైన తల్లి,
నీల పతాకము కేతనమై
అర్కపురిని విరజిమ్మిన; ॥వెలుగుచూపు॥

వెలుగుచూపు విశ్వజనని
ఈవిశ్వమంతా వెలుగేయని

వైశేషిక దర్శనం ద్రవ్యంలోని సూక్ష్మాతి సూక్ష్మ రేణువులలో కొన్నిటికి అణువు, కృణువు, జణువు అని నామనిర్దేశం చేసింది. ఆధునిక భౌతికశాస్త్రంలో ఆటంలోని కణాలకు ఎలక్ట్రాన్, ప్రొటాన్, న్యూట్రాన్ అని నామకరణం జరిగినట్లు. మనం అణువుని మోలిక్యూల్, అని ఆటం అంటే పరమాణువని సమానార్థకాలుగా చెప్పుకుంటున్నాం ఎలాగంటే సెకండులో 7/16 భాగమైన నిమేషాన్ని, మినిట్‌కి సమానార్థకంగా వాడుకుంటున్నట్లు, ఇది తప్పుకదా!

17. నీ కడుపులో పండనీ, అమ్మ మమ్ము!

రాగం కళ్యాణి - ఆది తాళా

నీ కడుపులో పండనీ - అమ్మా మమ్ము!
నీ స్తనములే కుడువనీ - అమ్మా మమ్ము!

(1) నీ పాలనే త్రాగనీ - అమ్మా మమ్ము;
నీ చేతులే నిమురనీ - అమ్మా మమ్ము; ॥నీ కడుపులో॥

(2) నీ పొత్తిళ్ళల్లో ఎదగనీ - అమ్మా మమ్ము;
నీ దీవనలె పొందనీ - అమ్మా మమ్ము; ॥నీ కడుపులో॥

(3) నీ చదువులే చదువనీ - అమ్మా మమ్ము;
నీ తలపులే తలచనీ - అమ్మా మమ్ము; ॥నీ కడుపులో॥

(4) నీ గుణములే కలుగనీ - అమ్మామాకు;
నీ ధ్యానమే సాగనీ - అమ్మా మాకు; ॥నీ కడుపులో॥

(5) నీవె సర్వమనిపించనీ - అమ్మా మాకు,
నీ కంటె వేరు లేదనిపించనీ - అమ్మా మాకు; ॥నీ కడుపులో॥

(6) నీ గీతికలే పాడనీ - అమ్మా మమ్ము;
నీ జ్ఞానమే కలుగనీ - అమ్మా మాకు; ॥నీ కడుపులో॥

నీ కడుపులో పండనీ - అమ్మా మమ్ము!
నీ స్తనములే కుడవనీ - అమ్మా మమ్ము!

18. అంఆ

రాగం ద్విజావంతి - త్రిపుట తాళం

సూర్యచంద్రుల సొంపు లొలికే
కన్నులేయవి కాంచగా,
నల్లని కనుబొమల క్రిందను,
నిండు చందురు సొగసులే, అమ్మా; ॥సూర్యచంద్రుల॥

1. బాలభానుని బింబమేయన
ఫాలభాగపు తిలకమే।
ఏమి మోమది ఏమి మోమది
పోలికే లేనట్టిదే, అమ్మా, ॥సూర్యచంద్రుల॥

2. గుండెలంతా పమిటెకప్పుకు
నవ్వు నవ్వే పెదవులందున,
తిండి తినుడను చేతిముద్ర
ఎవరికే, ఇంకెవరికే, అమ్మా; ॥సూర్యచంద్రుల॥

3. సందెవేళ వాహ్యాళి తిరిగే
నీ హంసగమనము చూడగా,
అబ్బురము అబ్బురము కాదటే
మాకబ్బిన ఈ భాగ్యమమ్మా, ॥సూర్యచంద్రుల॥

సూర్యచంద్రుల సొంపు లొలికే
కన్నులేయవి కాంచగా,
నల్లని కనుబొమల క్రిందను
నిండు చందురు సొగసులే, అమ్మా!

19.అమ్మా!

రాగం ఆనందభైరవి - తాళం ఆది

యుగముల నడిపెడి
జగముల జరిపెడి,
సకలాధారము నీవే!
సర్వాధారము నీవే! అమ్మా, ॥యుగముల॥

1చరణం ఏ లోకంబులు ఏ జీవులకని
విడివిడి పంచుట నీవే, ॥యుగముల॥
ఆలోకంబులు, ఆజీవులకని,
వడివడి త్రిప్పుట నీవే, అమ్మా; ॥యుగముల॥

2చరణం ఈ లోకంబున ఈ జీవులకని,
సడిసడి చేర్చుట నీవే,
ఈ కలిలో నా కాకలిలేదని, మా
ఆకలితీర్చుట, నీవే, అమ్మా! ॥యుగముల॥

యుగముల నడిపెడి
జగముల జరిపెడి,
సకలాధారము నీవే!
సర్వాధారము నీవే, అమ్మా!

20. తెలియని తనము

రాగం వలజి - తాళం ఆది

తెలియని తనము తొలగుటెలా?
తలపులు మదిలో తెగునదెలా? ॥తెలియని॥

1. ఇలలో చనువులు చేరునెలా?
కలలో రూపులు కూరునెలా? ॥తెలియని॥

2. నిదురకు లోబడి మునుగుటెలా?
ఎదలో పదిలమగు వైనమెలా? ॥తెలియని॥

3. మనమున మాయను కదుగుటెలా?
అనయము నీ నామస్మరణ మెలా? ॥తెలియని॥

4. సతతము నీరూప ధ్యానమెలా?
వెతలన్నీకరగి నీవగునదెలా? ॥తెలియని॥

తెలియని తనము తొలగుటెలా?
తలపులు మదిలో తెగునదెలా?

21. అమ్మ పంచరత్నాలు

రాగం వలజి - తాళం ఆది

1. "మేను నేనైన నేనులమైన" మాకందరకు
"నేను నేనైన నేనని" తెలియజెప్పు,
నీ నిజ స్వరూప వివరణ తెల్పు,
నీమాట కోటి రతనాల మూటట, అమ్మా!

2. దేహమే నేనను భ్రాంతినుండి విడవడలేక
అలమటించు, నీ బిడ్డలందర సాకి, అన్నమిడి,
మీదేమియు లేదు, అంతా "నేనే" చూచుకొందునను,
నీ మాట కోటి రతనాల మూటట, అమ్మా!

3. 'అది' ఏదో ఉందని, "దీనిని" మించి అని ఎంచు
మా కందరకు, దీనికంటె "అది" వేరెక్కడయని,
నీపృచ్ఛ, మరి "ఇది యది కాకపోతే కదా!" యను
నీమాట కోటి రతనాల మూటట, అమ్మా!

4. దారితప్పి తిరుగాడు ఈ పాంథులనెల్ల
నీయక్కున చేర్చుకుని, సేదతీర్చి,
అన్నమిడి, "మీరందరూ నా బిడ్డలే" యను
నీమాట కోటి రతనాల మూటట, అమ్మా!

5. నీముందు ఎందరెందరో మంచిచెడుల మధ్య
విచక్షణ చూప, ధర్మ స్వరూప మిదియంచునెంచ,
"మంచికి ఏది కారణమో, చెడుకుకూడ నదియేనను"
నీ మాట కోటి రతనాల మూటట, అమ్మా!

22. సుందరము

రాగం - మోహన - తాళం ఖండచాపు

సుందరము, సుందరము
నీ వదనార విందంబు,
ఇందిరా మందిరము
సర్వ శుభకరము; ॥సుందరము॥

1. కష్టాల కడలిలో, అనిష్టాల వెతలతో,
ఈ సడింపులు, చీదరింపులు,
వెక్కిరింపులు, హుంకరింపులు
సర్వసమముగ నెంచు నీచరితయే సుందరము; ॥సుందరము॥

2. ఎందరో నీముందు మంచి చెడ్డల నెంచి,
రక్షణలు శిక్షణలు తమ విధిగ భావించ,
వారి చరితలే దివ్య భాగవతములాయె
బహుళార్థ పురుషార్థ సాధనములాయె; ॥సుందరము॥

3. తల్లికి తనయుల తప్పు కనిపించదని
దివ్యామృతప్రేమ పంచి ఇచ్చిన తల్లి!
కనిన వారికి, కననివారికి సుగతి కలిగించు
అవని నీచరితంబు, పరమ పురుషార్థమమ్మా; ॥సుందరము॥

4. అమ్మవై యందరికి
అవని ప్రేమను పంచు,
ప్రేమావతారమగు
నీ చరితయే సుందరము; ॥సుందరము॥

సుందరము, సుందరము
నీ వదనార విందంబు,
ఇందిరా మందిరము
సర్వ శుభకరము;

23. ఇది ఏమి అవతరణ మమ్మా! నీది

రాగం - షణ్ముఖప్రియ - తాళం ఆది

పల్లవి : ఇది ఏమి అవతరణమమ్మా నీది!
విధిని మించిన తత్త్వమమ్మా, నీది!

***

అను పల్లవి : అలనాటి కుర్రని పోలు సహనము నీది
ఏ నాటికైనా నిజము తెలియక పోదు; ॥ఇది ఏమి॥

1 : నాగుల చవితికి నాగేంద్రుదవుపించె
నాగయజ్ఞోపవీతివై నదయాడు నీకు,
పాములే సాధకులు, పాములే బాధకులు
పాము పడగన వాసమమ్మా నీది; ॥ఇది ఏమి॥

2 విషము కక్కెడి పాము కాటులే తిన్నావు,
విషమునే మ్రింగావు, విషహరవు నీవమ్మ,
వళ్ళంత నల్లబడ నీలవపుషివి నీవు,
అల్ల నీలకంఠుని మించు చేష్టకదా నీది; ॥ఇది ఏమి॥

3 నిప్పుల కుంపటిని దుంపవలె ఉంచారు,
నిప్పులే చేతిలో పోసి చూశారు,
అప్పటికి కూడ నీతత్త్వ మెఱుకే లేదు,
ఎప్పటి దానవే నీవు, ఈ రాక ఏలనే నీకు; ॥ఇది ఏమి॥

4 జిల్లెళ్ళ మూడిలో ఏకపంక్తిన లక్ష
వళ్ళు గగురించెనే, లక్షలకు అన్నమిడ,
ఏ జన్మ పుణ్యమో , నీ సేవ దొరికేను,
అజునిమించిన తత్త్వమమ్మా నీది; ॥ఇది ఏమి॥

* ప్రహ్లాదుడు

24. జిల్లెళ్ళమూడి అమ్మ సచ్చరిత్ర

(గేయం)

రాగమాలిక

ఇది ఏమి అవతరణ మమ్మానీది!

రాగం హంసధ్వని ఆదితాళం:

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల
సర్వశుభముల గాంతురు ॥సర్వారంభము॥

సిద్ధి బుద్ధి ప్రదాతను,
సిద్ధ సంఘ సంపూజ్యుని,
విఘ్నహరుని మదిని, ని
ర్విఘ్నతకై కైమోడ్చిన; ॥సర్వారంభము॥

అలనాడు పాల్కడలి తరచువేళ
తొలిపూజ పొందు ఈ వేల్పుల పెద్దకు,
సురాసురులు మ్రొక్కులిడగ,
అమృతసిద్ధి, లక్ష్మీప్రసన్నత కలిగె కదా! ॥సర్వారంభము॥

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల
సర్వశుభముల గాంతురు

గం గణేశాయనమః

అస్మద్గురుభ్యో నమః

యద్వక్త్ర మానస సరః ప్రతిలబ్ధ జన్మ
భాష్యారవింద మకరంద రసం పిబంతి।
ప్రత్యాశ మున్ముఖ వినీత వినేయభృంగాః
తాన్ భాష్యవిత్తక గురూన్ ప్రణమామి మూర్ధ్నా॥
(పద్మపాదాచార్యులవారు తమ పంచపాదికలో)

జిల్లెళ్ళమూడి అమ్మ సంస్తవము

యయా శక్త్యా బ్రహ్మే కమలనయనః ఫాలనయనః
జగత్స్రష్టుంపాతుం ప్రళయముప నేతుంచ కుశలాః।
యయా వ్యాప్తం విశ్వం వసతి ఖలుయస్యాంజగదిదమ్
నమామాద్యాం దేవీం ముకుళిత కరస్తా మభయదామ్॥

(డా॥ పన్నాల రాధాకృష్ణ శర్మ)

జయహో మాతా
శ్రీ అనసూయా,
రాజరాజేశ్వరి
శ్రీపరాత్పరి

సహనా వవతు
సహనౌ భునక్తు
సహవీర్యం కరవావ హై
తేజస్వినావ ధీతమస్తు
మావిద్విషావహై!
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః।

హరిః ఓం!
బ్రహ్మవిదాప్నోతిపరం!
తదేషా౽భ్యుక్తా!
సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ!
యోవేద నిహితం గుహాయాం
పరమే వ్యోమన్।
సో౽శ్నుతే సర్వాన్ కామాన్ స్థహ।
బ్రహ్మణా విపశ్చితేతి!
తస్మాద్వా ఏతస్మాదాత్మన
ఆకాశ స్సంభూతః।
ఆకాశాద్వాయుః।
వాయోరగ్నిః।
అగ్నేరాపః।
అద్భ్యః పృథివీ।
పృథివ్యా మోషధయః।
ఓషధీభ్యో౽న్నమ్।
అన్నాత్ పురుషః।
సవా ఏష పురుషో
అన్న రసమయః।

(తైత్తరీయోపనిషత్తు ఆనందవల్లి)

సహనా వవతు
సహనౌ భునక్తు
సహవీర్యం కరవావ హై
తేజస్వినావ ధీతమస్తు
మావిద్విషావహై!
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ।

ఒకటి కనిపించు రెండుగా
రెండు చూచిన ఒకటెగా,
శివమైన తత్త్వంబు
సర్వాధిష్ఠానంబు,
శక్తి సమ్మిళితంబు
శంకరము, శుభకరము,
అభవమగు తత్త్వమున
శక్తికుంచనమే ఆకార భ్రాంతి;
శక్తి కుంచించుకుని,
రూపు నొందిన వేళ,
కిరణములు, రేణువులు,
వెలుగులై విరజిమ్మ,
ద్విత్వ భావనకిదె
ఆకరం బగును,
అభవ సంబంధమే।
ద్రవ్య గుణ బంధము:

---

* తైత్తిరీయో పనిషత్తులోని ఆనందవల్లిలో వేదం కీర్తించిన సృష్టి క్రమాన్ని శ్రీ శంకరులు తమ ప్రస్థానత్రయ భాష్యంలో ఒప్పారు. సాంఖ్యసృష్టి క్రమాన్ని సాధారణ అవగాహన నిమిత్తం ఒప్పినా, బ్రహ్మము నుండి వివర్త నిమిత్తోపాదాన కారణంగా ఆకాశము, అందుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలమునుండి పృథివీ, పృథివీ నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నము, అన్నము నుండి పురుషుడు వెలువడినట్లు కనిపించుచున్నదని, అట్టి పురుషుడు అన్నరసమయుడేనని, అందుచే బ్రహ్మమే సర్వమునకు నిమిత్తోపదాన కారణమని శ్రుతి తాత్పర్యమని శ్రీశంకరులు నుడివియున్నారు. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివీ ఈ ఐదును తరచి చూస్తే రెండుగానే కనిపిస్తాయి. అవి ఆకాశము, ద్రవ్యము. వాయువు, అగ్ని జలము, పృథివి ఈ నాలుగూ ద్రవ్యం యొక్క రూపాంతరాలే.

రోదసిలో ద్రవ్యంబు
పెట్టెడి పరుగులే
కాలముగ సంజ్ఞ;
ద్రవ్యంబు పోగులై
విశ్వమావిర్భవింప;

అట్టిపోగులు చెదరి
కాంతిలోకాలు పుట్ట; (నక్షత్ర రాశులు, నక్షత్రాలు)
వ్యోమ వారాశిలో
కదలాడు లోకాలు
కాల ప్రవాహంబు
కృత్యాది యుగములు;

అట్టి కాలమునందు
యుగయుగంబులు గడుచు;
కృత్యాది యుగములు
ఒకటి వెంబడి ఒకటి
తిరిగివచ్చెడి తత్త్వమే
కాలగణణంబు:

అట్టి కాలము నందు
కృష్ణ నిర్యాణముతో
ద్వాపరము వెడలె,
పంచసహస్రముల పాటు
భువి రవిని దివిని తిరుగాడె;

అందుచే ఆకాశము, ద్రవ్యమూ ఈ రెండూ ఆత్మనుండే, అంటే బ్రహ్మము నుండే, బాహ్య సృష్టి బ్రహ్మము నుండే. బాహ్య సృష్టి బ్రహ్మము నుండి అయితే, కలలో సృష్టి "అయమాత్మా" నుండి. ఈ విభాగం యొక్క అవగాహన దృఢమయితే, ఈ రెండింటికీ అభేదం ఇట్టే స్ఫురిస్తుంది. "అయమాత్మా బ్రహ్మ" అనే మాండూక్య మహావాక్య బోధ స్ఫురిస్తుంది. (తరువాయి 35వ పుటలో)

ఆత్మనుండే సర్వమూ, "సర్వంఖల్విదం బ్రహ్మ" అనే మహా వాక్యసిద్ధి కలుగజేయడానికి శ్రీశంకరులు ఈ బ్రహ్మాండ పురాణాంతర్గతమైనఈ క్రింది శ్లోకాన్ని ముందు నిడుకుని తమ గీతాభాష్య భూమికను "స భగవాన్" అని ప్రారంభిస్తారు.

"ఈ కలిని నాకాకలే
లేదనుచు ఒకయమ్మ
పృథివిపై దేహధారణ చేసె;
ఆయమ్మ చరితమే
భువిని దివ్య భగవత మాయె;

నాదు గురువులు, జగద్గురువులు,
జగద్వంద్యులు, చంద్రశేఖర
సంయమీంద్రులు అందముగ
ఒకనాటి తేయిని,
దండ సహితులై దండమిడిన
దండి దృశ్యము డెందమున
నిండగా, మెండుగా పండగా,
"ఇది ఏమి అవతరణమమ్మా నీది!
విధినిమించిన తత్త్వమమ్మా నీది!
యని పాడుచు, ఆడుచు, పాడుచు,
నీ కథను చాటుచు పయనించెదనే ఓయమ్మా!
ప్రాణము వదలెద నోయమ్మా,!

(ఇంకా ఉంది)

నారాయణః పరో உ వ్యక్తాత్
అండ మవ్యక్త సంభవమ్।
అండస్యాంతః ఇమేలోకాః
సప్త ద్వీపాచ మేదినీ॥

(బ్రహ్మాండ పురాణము - వ్యాసమహర్షి)

అనుబంధం

శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారు (రాజు బావ) అమ్మకు అక్షరసుమాలతో మాలికలల్లి, సమర్పించి, అర్చించుకున్న వైనాన్ని తెలియజేసే "అనుభవ సారం" గ్రంథం నుండి నేను "పంచరత్నాలుగా" ఎంచుకున్న గేయాల సాహిత్యం -

1. ఎంతమంచిదానవోయమ్మా!

ఎంతమంచి దానవో యమ్మా! నీ
దెంత మంచి విధానమో యమ్మా! ॥ఎంత॥

1 నీదు హృదయమె నిండుకుండ,
నీదు ఓరిమి భూమి ఓరిమి,
నీకు నీవే సాటి తల్లీ,
నీకు నీవే సాటి తల్లీ; ॥ఎంత॥

2 దారితెన్ను తెలియరాని
దుర్గమంబగు మార్గమందున,
దారిచూపెడి దివ్యజ్యోతివి
తీరు తెలిపెడి వేగుచుక్కవు; ॥ఎంత॥

3 పతిత మానవ వ్యథా కలిత
హృదయ హృదయాంతరాళములో,
మలినమంతయు వెలికిలాగి
కడిగివేసే జాహ్నవివి నీవే; ॥ఎంత॥

ఎంత మంచిదానవో యమ్మా! నీ
దెంతమంచి విధానమో యమ్మా!

2 . అమ్మా! స్థిరోభవ - వరదోభవ

అమ్మా స్థిరోభవ - వరదోభవ
సుముఖోభవ - సుప్రసన్నోభవ; ॥అమ్మా॥

(1) అతి నిర్మలంబైన - సువిశాలంబైన
హృదయ మందిరమందు - అమ్మా స్థిరోభవ,
కోరికలు కోరేటి కోరికే లేనట్టి
మనసుందునట్లుగా - వరదోభవ; ॥అమ్మా॥

(2) సుమనోహరంబైన - విశ్వమోహనమైన
దరహాస చంద్రికల - సుముఖోభవ,
యోగులకు, భోగులకు, యోగ్యులకయోగ్యులకు
సర్వసృష్టికి - సుప్రసన్నోభవ, ॥అమ్మా॥

అమ్మా స్థిరాభవ - వరదాభవ
సుముఖాభవ - సుప్రసన్నాభవః

3. అక్షరమునకు ఆది అమ్మ

అక్షరమునకు ఆది అమ్మ
అక్షయంబైనదే అమ్మ,

1. సర్వంబు ఒకటిగా అనిపించు నీకు,
సర్వంబు నీవుగా కనిపించు నాకు,
"ఒకటిగా అనిపించు, రెండుగా కనిపించు"
అసలు ఇది ఏమిటన - అదియె అష్టాక్షరి,

॥అక్షరమునకు॥

2. తనయులెందరో - తల్లికి
తల్లియొక్కరె - జగతికి,
జన్మనిచ్చిన తల్లి - మర్మమిప్పిన జనని,
అన్ని జన్మలలోన - అమ్మ ప్రథమాక్షరి,

॥అక్షరమునకు॥

అక్షరమునకు ఆది అమ్మ
అక్షయంబైనదే అమ్మ

4. నీనామమే పావనం

అమ్మా!
నీనామమే పావనమ్,
నీరూపమే భావనమ్; ॥నీనామమే॥

1. శిశువైన పిలిచేది నీనామమే,
పశువైన పిలిచేది నీనామమే, ॥నీనామమే॥

2. తాపసులు తలచేది, తామసులు కొలిచేది
దివ్యమంగళమైన నీరూపమే॥ ॥నీనామమే॥

3. సృష్టిలో వెలసింది నీ నామమే,
కష్టాల స్ఫురియించు నీనామమే; ॥నీనామమే॥

4. కళ్యాణ రూపంబు కాంచగలిగిన కనుల
వెలిగేను నీ దివ్య నీరాజనమ్॥ ॥నీనామమే॥

అమ్మా! నీనామమే పావనమ్,
నీరూపమే భావనమ్

5. దిగివచ్చినారు

దిగివచ్చినారు, ఒదిగొచ్చినారు
దివినుండి దేవతలు దిగివచ్చినారు,
తల్లి దీవెనలంద
తరలొచ్చినారు; ॥దిగివచ్చినారు॥

1చరణం: నిత్యకళ్యాణమై పచ్చతోరణమై
నిరతాన్నదాన వైభవము విలసిల్లు,
అన్నపూర్ణాలయము చూడ, అమ్మ
అమృత కలశాలయము చూడ; ॥దిగివచ్చినారు॥

2చరణం: కామితార్థ ప్రదము, కాలుష్యహరము
ధర లోన దాక్షిణ్య దేవాలయంబు,
దివ్య హైమాలయము చూడ, అమ్మ
భవ్యప్రేమాలయము చూడ; ॥దిగివచ్చినారు॥

3చరణం: మహిని పావనము, మహిమాన్వితంబు,
అఖిల అభయప్రదము, అర్థనారీశ్వరము,
నాగేశ్వరాలయము చూడ, అమ్మ
భాగేశ్వరాలయము చూడ, ॥దిగివచ్చినారు॥

దిగివచ్చినారు, ఒదిగొచ్చినారు,
దివినుండి దేవతలు దిగివచ్చినారు,
తల్లి దీవెనలంద
తరలొచ్చినారు:

నీరాజనం

పరమాత్మవైన నా అమ్మా!

ఈ "పంచరత్నాలకు' ముక్తాయింపుగా రాజుబావ
వ్రాసిన నీరాజనం ఇచ్చే గేయం:-

పరమాత్మవైన నా అమ్మా!
నీరాజనమ్ము గైకొమ్మా; ॥పరమాత్మ॥

నుడిగాలిలో సొక్కిసోలి,
నడిలేని నీ ఒడిలో వ్రాలి
జడప్రాయమైన జీవాళి,
దరిచేర్చు తల్లీ నివాళి! ॥పరమాత్మ॥

భేదమెరుగని నీ విధానాలు,
బోధించుమాకు వేదాలు,
వేదాలు తెలుపు సారాలు
మా నుదుట నీ చేతివ్రాలు: ॥పరమాత్మ॥

పరమాత్మవైన నా అమ్మా
నీరాజనమ్ము గైకొమ్మా;

గ్రంథకర్త పరిచయము



శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి గారి జననం 1935 తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు గ్రామంలో. బులుసు సోమనాథశాస్త్రి, శేషమ్మ గారలు వీరి తల్లితండ్రులు. వీరిది వేద పండితుల వంశం. వీరి విద్యాభ్యాసం కాకినాడ, బొంబాయి నగరాలలో...

వీరి తండ్రిగారు తెలుగు పండితులు, భాషావేత్తలు. తూర్పుగోదావరి జిల్లా రెవిన్యూ శాఖలో ఉద్యోగం చేసి, డిప్యూటీ తహశీల్దార్, మెజిస్ట్రేట్‌గా పదవీ విరమణ చేసియుండిరి.

శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రిగారు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభివృద్ధి, ప్రణాళిక రచన విభాగాలలో పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరి విపిదిష, వాసుదేవ మూర్తి నవలలు, తెలుగులో మహాకావ్యం, మాండూక్యగీతము, అక్షరంపీఠిన పడింది, పదార్చన కృష్ణం వందే జగద్గురుం (నృత్యరూపకం), శంకరులు అద్వైత సిద్ధాంతము - ఒక అవగాహన సుబ్రహ్మ సశివ స్వహరి స్వేంద్రు స్వాక్షరతాః పరమ స్వరాట్ తెలుగులో ప్రచురించబడ్డాయి. వీరి మాండూక్యోపనిషద్-ఎ స్టడీ, కారొరేషన్ ఆఫ్ ది శాండల్స్ అనే ఆంగ్ల నాటకం భారతీయ విద్యాభవన్ వారు ప్రచురించారు.

శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి గారి రచన పదార్చన ద్వితీయభాగం పదాలతో అర్చన. స్తుతులు, కీర్తనలు, గేయాలు, తత్త్వాలుగా వీరి పదాలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. అమ్మను అర్చించుకున్నాయి.

Padmanabha Offset Printers, Ramaraopeta, KAKINADA. Ph : 0884-6588013